

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 18-02-2026 | సంపుటి - 26 | సంచిక -270 | రూ : 4 | పేజీలు: 8


## బయో వరల్డ్‌గా తెలంగాణరాష్ట్రం

- వేగంగా ఎదుగుతోంది.. భాగస్వాములవ్వండి
- మా ప్రజా ప్రభుత్వం మీకు బాసటగా ఉంటుంది
- ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో'ను ప్రారంభించాం
- 'బయో ఆసియా 2026' సదస్సు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



2లో



## ఫ్రాన్స్‌తో.. భాగస్వామ్యం ఇక ప్రత్యేకం

- రక్షణ, వాణిజ్యం, టెక్నాలజీల్లో మరింత విస్తృతం
- మోదీమెక్రాన్ చర్చల్లో నిర్ణయం.. 21 ఒప్పందాలు ఖరారు

ముంబయి: తమ మధ్య సంబంధాలను 'ప్రత్యేక ప్రపంచవ్యాప్త వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచాలని భారత్ ఫ్రాన్స్ నిర్ణయించాయి. ప్రపంచంలో భౌగోళిక, రాజకీయ కల్లోల పరిస్థితుల్లో రక్షణ, వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఉన్నత సాంకేతికత రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని గణనీయంగా పెంచుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ప్రతినబూనారు. మోదీ ఆహ్వానం మేరకు మూడురోజు తరువాయి 2లో

## తీరంలో.. యుద్ధ నౌకల జాతర

- రాష్ట్రపతి విందుతో లాంఛనంగా ప్రారంభమైన ఐఎఫ్ఆర్
- నేడు ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణించనున్న ద్రౌపదీ ముర్ము

విశాఖపట్నం; సింధియా : ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం రాత్రి విశాఖ ఈఎన్‌సీ ఆఫీసర్స్ మెస్‌లో విందు (ప్రెసిడెన్షియల్ బాంక్వెట్) ఇచ్చారు. ఈ అంతర్జాతీయ ఉత్సవానికి హాజరవుతున్న వివిధ దేశాల నేవీ చీఫ్‌లకు దేశ రక్షణ దళాల సుప్రీం కమాండర్ హోదాలో రాష్ట్రపతి విందు ఇవ్వడం ఆనవాయితీ. ఈ విందుతో ఐఎఫ్ఆర్ లాంఛనంగా ప్రారంభమైనట్లు భావిస్తారు. ఈ కార్యక్రమానికి తరువాయి 2లో





## బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిక్ రెహమాన్ ప్రమాణం

- హాజరైన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

ఢాకా: బంగ్లాదేశ్‌లో బీఎన్‌పీ నేతృత్వంలో నూతన ప్రభుత్వం కొలువుదీరింది. ప్రధామంత్రిగా తారిక్ రెహమాన్ ప్రమాణం చేశారు. జాతీయ పార్లమెంట్ భవనంలోని సౌత్ ప్లాజాలో బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ స్వయంగా తారిక్ రెహమాన్ చేత ప్రమాణం చేయించారు. అనంతరం పలువురు మంత్రులతో కూడా ప్రమాణం తరువాయి 2లో

## సినీ నటి ప్రత్యూష మృతి కేసులో.. సిద్ధార్థరెడ్డికి రెండేళ్ల జైలు శిక్ష ఖరారు

- హైకోర్టు ఆదేశాలను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు
- నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం
- హత్య, అత్యాచారం అనుమానాలను తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం
- 2002 ఫిబ్రవరిలో జరిగిన ఘటన కేసు ఎట్టకేలకు కొలిక్కి



2లో

## ఏప్రిల్‌లో.. మోగనున్న నగారా!

2లో

- ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు..
- తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, అసోంలో 'మే' నెలతో ముగియనున్న గడువు
- పుదుచ్చేరిలో జూన్ 15 చివరి తేదీ
- మార్చి రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్



## వైద్యులకు ఏఐ ప్రత్యామ్నాయం కాదు

- కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్
- మంగళగిరి ఎయిమ్స్‌లో ఘనంగా స్నాతకోత్సవం

అమరావతి, మంగళగిరి: 'వైద్యరంగంలో కృత్రిమ మేధ విప్లవాత్మక మార్పులు తెస్తోంది. వ్యాధుల నిర్ధారణ, ఆరోగ్య సేవల్లో క్లిష్ట సమస్యలకు ఏఐ టూల్స్ పరిష్కారాలు చూపిస్తున్నాయి. అయితే వైద్యులకు ఏఐ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు' అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి అనుప్రియా పటేల్ అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా తరువాయి 2లో

## 'వైర్‌లెస్' నగరం

- గ్రేటర్‌లో భూగర్భ విద్యుత్ లైన్
- రూ.14,725కోట్లతో ఏర్పాటుకు నిర్ణయం
- 9 సర్కిళ్లను మూడు జోన్లుగా విభజన
- పనులు సజావుగా జరిగేలా చర్యలు
- ఐదేండ్లలో పూర్తయ్యేలా ఎస్పీడీసీఎల్ కార్యాచరణ



2లో



## డేటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం

2లో

- భూపరిహారం నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించండి
- నూతన మున్సిపల్ పాలకమండళ్లతో త్వరలో సమావేశం
- వారికోసం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం
- మున్సిపాల్టీల్లో ప్రకటనల ఆదాయం పెంచండి
- మల్టీలెవల్ పార్కింగ్, స్కైవాక్ మార్కెట్లపై స్టడీ చేయండి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : సమీక్షా సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి

# బయో వరల్డ్‌గా తెలంగాణరాష్ట్రం

హైదరాబాద్: 'బయో ఆసియా తన పేరును దాటి.. బయో వరల్డ్‌గా మారుతోంది. ఈ సభను చూస్తుంటే.. బయో వరల్డ్‌గా తెలంగాణ ఎదుగుతుందనే విషయాన్ని నేను గర్వంగా చెప్పగలను. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు ఇక్కడికి వచ్చారు. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారు. సైన్స్, ఏఐ, బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులు కలిస్తే.. అసాధారణమైన ఫలితాలు వస్తాయి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. టెక్ బయో అన్‌లీష్: ఏఐ ఆటోమేషన్‌బయాలజీ రివల్యూషన్ థీమ్‌తో మాదాపూర్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్న 'బయో ఆసియా 2026'.. 23వ అంతర్జాతీయ సదస్సును మంగళవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. ''తెలంగాణ రాష్ట్రం వేగంగా ఎదుగుతోంది. మనమంతా కలిసి పనిచేస్తే.. ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుంచి హైదరాబాద్ ప్రపంచ జీవ విజ్ఞాన రాజధానిగా వృద్ధి చెందుతుంది. తెలంగాణ అంటే వ్యాపారం. వ్యాపార విస్తరణల కోసం.. అంతర్జాతీయ పెట్టుబడులకు తెలంగాణ సిద్ధంగా ఉంది. ఈ ఎదుగుదలలో మీరు భాగస్వాములవ్వండి హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఆసియా సదస్సు.. దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరంలా అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందనే నమ్మకం నాకు బలంగా ఉంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**మీ విజయంలో భాగస్వాములవుతాం**

''23 సంవత్సరాల క్రితం బయో ఆసియా ప్రారంభమైనప్పుడు.. హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ, సాఫ్ట్‌వేర్ నగరం అనే గుర్తింపు ఉండేది. ఈరోజు హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా నిలిచింది. దూరదృష్టిగల నాయకత్వం, స్పష్టమైన విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు.. ఈ బలాల ఆధారంగా హైదరాబాద్.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీలకు), పరిశోధన, డిజైన్లలో విశిష్టతకు ప్రపంచ కేంద్రంగా ఎదిగింది. ఈ రెండు సంవత్సరాల్లోనే జీవ విజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. కొద్ది వారాల కిందట దావోస్‌లో మా కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం. జీనోమ్ వ్యాలీని విస్తరించాం. ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్‌బయో'ను ప్రారంభించాం. గ్రీన్ ఫార్మా సిటీని వేగవంతం చేశాం. అనేక కొత్త జీసీసీలను ఆహ్వానించాం. ఇది సాధారణ అభివృద్ధి కాదు. ఇది దృఢమైన, చిత్తశుద్ధితో కూడిన దూరదృష్టి ఫలితం. దానికి ప్రత్యక్ష సాక్ష్యం బయో ఆసియా 2026 సదస్సు. ఇటీవల మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రకటించాం. అప్పటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం మా లక్ష్యం. పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న, మధ్య తరహా సంస్థలు.. ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరం. మీరు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు.

# 'వైర్‌లెస్' నగరం

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరం ఇక వైర్‌లెస్ సిటీగా మారనుంది. చేతికి అందేలా నెత్తిన వేలాడుతూ తరచూ ప్రమాదాలకు కారణమవుతున్న ఓవర్ హెడ్ (ఓహెచ్) విద్యుత్ లైన్లు కనుమరుగు కానున్నాయి. వాటి స్థానంలో భూగర్భ విద్యుత్ లైన్లు (యూజీ కేబుల్స్) అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పచ్చ జెండా ఊపింది. రూ.14,725 కోట్ల అంచనా వ్యయంతో సిటీలో 16 వేల కిలోమీటర్ల మేరకు ఈ కేబుళ్ల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో తొలి దశలో ఔటర్ రింగ్ రోడ్డుతోపాటు ఇటీవల కొత్తగా జీహెచ్‌ఎంసీలో కలిసిన కార్పొరేషన్లు, మున్సిపాల్టీలను కలుపుతూ కొత్తగా రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీలోనూ ఈ పనులు చేపట్టాలని డిస్కం భావిస్తోంది.

*** పలు నగరాల్లో అధికార బృందం పర్యటన**

ఇప్పటికే అధికారిక బృందం బెంగళూరు సహా పలు నగరాల్లో పర్యటించి భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటుపై అధ్యయనం చేసింది. ఇందుకు ఏటా కనీసం రూ.3వేల కోట్ల చొప్పున ఖర్చు అవుతుందనీ, రానున్న ఐదేండ్లలో ఈ పనులు పూర్తి చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇప్పటికే ప్రతిపాదనలను సైతం సిద్ధం చేసింది. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్డీఎస్‌ఎస్) పథకంలో భాగంగా ఈ పనులు చేపట్టనుంది.

*** ఐదేండ్లలో పూర్తయ్యేలా కసరత్తు**

భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటును రానున్న ఐదేండ్లలో పూర్తయ్యేలా డిస్కం ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే సైబర్ సిటీలో బ్లూ ప్రింట్ లేకపోవడంతో అడ్డదిడ్డమైన నిర్మాణాలతో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద అనేక బస్తీలు వెలిశాయి. చేతికి అందేంత ఎత్తులోనే వైర్లు వేలాడుతున్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షాలకు చెట్లకొమ్మలు విరిగి లైన్లపై పడిన సందర్భాలు సైతం అనేకం ఉన్నాయి. ఇప్పటికే రాజేంద్రనగర్, రామంతాపూర్ సహా చెట్లు ఎక్కువగా ఉన్న చోట్ల ఎయిర్ బంచ్డ్ కేబుల్స్ (ఏబీ) వేశారు. కొండాపూర్, గచ్చిబౌలి, మేడ్చల్ సహా పలు ప్రాంతాల్లో సుమారు వెయ్యి కిలోమీటర్ల వరకు యూజీ కేబుల్స్‌ను ఏర్పాటు చేశారు.

# బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిక్ రెహమాన్ ప్రమాణం

ఢాకా: బంగ్లాదేశ్‌లో బీఎన్‌పీ నేతృత్వంలో నూతన ప్రభుత్వం కొలువుదీరింది. ప్రధామంత్రిగా తారిక్ రెహమాన్ ప్రమాణం చేశారు. జాతీయ పార్లమెంట్ భవనంలోని సౌత్ ప్లాజాలో బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ స్వయంగా తారిక్ రెహమాన్ చేత ప్రమాణం చేయించారు. అనంతరం పలువురు మంత్రులతో కూడా ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమంలో భారత్ తరపున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పాల్గొన్నారు. ప్రధాని మోడీకి బీఎన్‌పీ ఆహ్వానం పంపినప్పటికీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మక్రాన్ భారత్‌లో పర్యటిస్తుండటంతో ఆయన స్థానంలో ఓం బిర్లా ఢాకా వెళ్లారు. అంతకు ముందు నూతనంగా ఎన్నికైన ఎంపీల చేత బంగ్లాదేశ్ ఎన్నికల కమిషనర్ నాసిరుద్దీన్ ప్రమాణం చేయించారు. ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ 13వ సార్వత్రిక ఎన్నికల్లో బీఎన్‌పీ పార్టీ భారీ విజయం సాధించింది. 297 స్థానాలకు ఎన్నికలు జరగ్గా 209 చోట్ల బీఎన్‌పీ అభ్యర్థులు గెలుపొందారు.

**మధ్యలోనే కాలేజీ విద్యను ఆపేసిన తారిక్**

తారిక్ రెహమాన్ ఢాకా విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ చదవడం కోసం జాయిన్ అయ్యారు. తొలుత న్యాయ విభాగంలో చేరి, ఆ తర్వాత అంతర్జాతీయ సంబంధాల విభాగంలో చేరారు. అయితే, గ్రాడ్యుయేషన్ రెండో ఏడాదిలో చదువును ఆపేశారు. ఆ తర్వాత టెక్స్‌టైల్స్, వ్యవసాయ సంబంధిత ఉత్పత్తుల వ్యాపారాలను ప్రారంభించారు. కాగా, తారిక్ రెహమాన్ 1994లో కార్డియాలజిస్ట్ డాక్టర్ జుబైదా రెహమాన్‌ను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఓ కుమార్తె ఉంది. ఆమె పేరు జైమా జర్నాజ్ రెహమాన్.

**క్రిమినల్, అవినీతి కేసులు నమోదు**

20012006 మధ్య తన తల్లి ఖాలిదా జియా బంగ్లాదేశ్ ప్రధానిగా ఉన్న సమయంలో తారిక్ ప్రభుత్వం లో కీలక పాత్ర పోషించారు. అలాగే ప్రభుత్వానికి సమాంతరంగా పాలన సాగిస్తున్నారనే ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో అవామీ లీగ్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత తారిక్‌పై క్రిమినల్, అవినీతి కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో కొన్ని కేసుల్లో తారిక్ దోషిగా తేలారు. 2004లో షేక్ హసీనా చేపట్టిన ర్యాలీపై గ్రెనేడ్ దాడి జరిగింది. ఈ దాడిలో 24 మంది మృతి చెందారు. పదుల మంది గాయపడ్డారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తారిక్ రెహమాన్‌పై చర్యలు తీసుకుంది. ఈ దాడికి ప్రధాన సూత్రదారుడు తారిక్ అని తేలడంతో ఆయనకు జీవిత ఖైదు పడింది.

# ఏప్రిల్‌లో మోగనున్న నగారా!

న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు ఏప్రిల్ నెలలో నగారా మోగనుంది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరిలో ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం మార్చి రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. అయితే తమిళనాడు, అసోం, కేరళ, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ గడువు మే నెలలో ముగియనుంది. పుదుచ్చేరి అసెంబ్లీ గడువు జూన్ 15 నాటికి ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈసీ అధికారులు ఇప్పటికే ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహిస్తున్నారు.ఇదిలా ఉండగా 2021లో పశ్చిమబెంగాల్‌లో ఎనిమిది విడతల్లో పోలింగ్ నిర్వహించారు. అసోంలో రెండు, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలో ఒకే విడతలో ఈసీ ఎన్నికలు నిర్వహించింది. మరోవైపు, ఆయా రాష్ట్రాల్లో ఈసీ నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. పుదుచ్చేరిలో ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను కూడా ప్రకటించారు.

# డేటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం

హైదరాబాద్ : డేటా సెంటర్లకు వివిధ రాష్ట్రాలు ఇస్తున్న రాయితీలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు, వారికి అవసరమైన భూమి, ఇతర వసతులపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. డేటా సెంటర్లకు భూ కేటాయింపులో హేతుబద్ధత ఉండాలనీ, వీటికోసం వివిధ ప్రాంతాల్లో కల్పిస్తున్న మౌలిక వసతుల కల్పన, భూ సేకరణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ పరిహారం నిర్ణయం విషయంలో ఉదారంగా ఉండాలని సూచించారు. రైతులను పిలిచి మాట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిహారం నిర్ణయించాలని చెప్పారు. రూ.వేల కోట్లతో పెట్టుబడులు పెట్టే సంస్థలు భూమిపై పెట్టే పెట్టుబడి చాలా స్వల్పమనీ, కంపెనీలకు సకాలంలో భూమి, ఇతర వసతులు అందుబాటులో ఉంచితే త్వరగా పనులు పూర్తి చేసుకుంటారని అన్నారు. అనంతరం ఆయన పురపాలకశాఖపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు ఆర్వీ కర్ణన్, సృజన, వినయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మెన్లు, డిప్యూటీ చైర్మెన్లతో త్వరలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలను వారికి వివరించాలని సూచించారు. తాను స్వయంగా ఆ సమావేశానికి హాజరై, నూతనంగా ఎన్నికైన వారితో మాట్లాడాతానని తెలిపారు.పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ఆయన అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. మున్సిపాల్టీల్లో ప్రకటనల ఆదాయం పెంచుకోవాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మల్టీలెవల్ పార్కింగ్, స్కైవాక్ మార్కెట్లపై అధ్యయనం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. రాజధాని హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పడిన గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. తానే స్వయంగా ఆయా మున్సిపాల్టీల్లో ప్రత్యక్ష పరిశీలనకు వస్తానన్నారు. ఎక్కడైనా చెత్త కనపడితే సహించేది లేదనీ, విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణ పరిశీలన కోసం ఆయా నగర పాలక సంస్థల కమిషనర్లు తెల్లవారు జామున ఆరు గంటలకే క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ప్రకటనల ఆదాయం పెంపుదల పాలసీపై మాట్లాడుతూ నగరంలో కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలనీ, ఎలక్ట్రిక్, ఇతర కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటనల బోర్డులు వాటిపైనే ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. హైదరాబాద్ సిటీలో ప్రయివేటు భూముల్లోనూ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు.

# వైద్యులకు ఏఐ ప్రత్యామ్నాయం కాదు

మంగళగిరి: 'వైద్యరంగంలో కృత్రిమ మేధ విప్లవాత్మక మార్పులు తెస్తోంది. వ్యాధుల నిర్ధారణ, ఆరోగ్య సేవల్లో క్లిష్ట సమస్యలకు ఏఐ టూల్స్ పరిష్కారాలు చూపిస్తున్నాయి. అయితే వైద్యులకు ఏఐ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు' అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి అనుప్రియా పటేల్ అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్‌లో నిర్వహించిన రెండో స్నాతకోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'వైద్య చికిత్స కోసం ప్రజలు తమ ఆస్తులు పోగొట్టుకోకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశం. పీ□ఎంజేఏవై ద్వారా 65 కోట్ల మందికి రూ.5 లక్షల చొప్పున ఉచిత వైద్య సదుపాయాలను అందిస్తున్నాం. ప్రధాని మోదీ ఉన్నతాశయంతో తీసుకొచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీపై ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది' అని కేంద్ర మంత్రి చెప్పారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్‌తో కలిసి గర్భిణుల సౌకర్యం కోసం 'ఎర్లీ మార్నింగ్ యాంటీ నాటల్ క్లినిక్' ప్రారంభించారు. 58 మంది వైద్య విద్యార్థులకు పట్టాలు, ముగ్గురికి బంగారు పతకాలు అందజేశారు.

**విధి నిర్వహణలో నైతికత మరవొద్దు**

**-మంత్రి లోకేశ్**

'వైద్యులు అత్యున్నత నైతిక స్థానంలో ఉంటారు. జీవితానికి, మరణానికి మధ్య నిలబడి ప్రాణదాతలుగా సేవలందిస్తున్నారు' అని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. కొవిడ్ సమయంలో ప్రపంచమంతా ఇళ్లకే పరిమితమైనప్పుడు, రోగుల ప్రాణాలను కాపాడడానికి వైద్యులు విపత్కర పరిస్థితుల్లో సేవలందించారని గుర్తు చేశారు. మీ నైపుణ్యానికి ఏఐ సహాయం చేస్తుందని, కానీ వైద్యుడి చేతి స్పర్శలోని స్వస్థత శక్తి సాటిలేనిదని ఆయన అన్నారు. లాభాపేక్షతో ఔషధాలను సూచించొద్దన్నారు. కార్యక్రమంలో మంగళగిరి ఎయిమ్స్ ప్రెసిడెంట్ తపన్‌కుమార్ సాహా, ఈడీ అహంతెమ్ శాంతాసింగ్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ తదితరులు పాల్గొన్నారు.

## సినీ నటి ప్రత్యూష మృతి కేసులో..

# సిద్ధార్థరెడ్డికి రెండేళ్ల జైలు శిక్ష ఖరారు

ఢిల్లీ: రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన సినీ నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడు గుడిపల్లి సిద్ధార్థరెడ్డికి తెలంగాణ హైకోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను సుప్రీంకోర్టు ఖరారు చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ సిద్ధార్థరెడ్డి దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. మిగిలిన కాలానికి జైలుశిక్ష అనుభవించడానికి వీలుగా నాలుగు వారాల్లోపు లొంగిపోవాలని ఆదేశించింది. అదే సమయంలో అతని శిక్షను పెంచాలని కోరుతూ ప్రత్యూష తల్లి సరోజినీదేవి దాఖలుచేసిన అప్పీల్‌నూ సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మంగళవారం జస్టిస్ రాజేష్‌బిందల్, జస్టిస్ మన్మోహన్‌లతోకూడిన ధర్మాసనం 60 పేజీల తీర్పు వెలువరించింది. 2002 ఫిబ్రవరిలో జరిగిన ఈ సంఘటనపై ట్రయల్ నిర్వహించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఇందులో నిందితుడు సిద్ధార్థరెడ్డికి ఐపీసీ 306 (ఆత్మహత్యకు పురికొల్పడం), 309 (ఆత్మహత్యకు ప్రయత్నించడం) సెక్షన్ల కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ 2004 ఫిబ్రవరి 23న తీర్పు చెప్పారు. దాన్ని సవాల్ చేస్తూ సిద్ధార్థరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా... జైలుశిక్షను రెండేళ్లకు తగ్గించి, జరిమానాను రూ.50 వేలకు పెంచుతూ 2011 డిసెంబరు 28న తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అటు నిందితుడు, అతడికి విధించిన శిక్షను పెంచాలంటూ ఇటు సరోజినీదేవి 2012లో సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. గత ఏడాది నవంబరు 19న తీర్పు రిజర్వ్ చేసిన సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం దాన్ని వెలువరించింది. ప్రత్యూష పురుగుల మందు తాగడంవల్లే చనిపోయారు తప్పితే ఆమెది హత్య కాదని స్పష్టంచేసింది. ''రికార్డుల్లో ఉన్న ఆధారాలను లోతుగా పరిశీలించినప్పుడు ఆమె ఆర్గానోఫాస్ఫేట్ విషం తాగడంవల్లే మరణించినట్లు స్పష్టమవుతోంది. ఆమెపై సిద్ధార్థరెడ్డి అత్యాచారానికి పాల్పడినట్లు నిరూపితంకాలేదు. పురుగుల మందు ప్రాణాంతకం అని తెలిసీ సిద్ధార్థరెడ్డి దాన్ని కొనుగోలుచేసి ఇద్దరూ కలిసి తాగేలా మృతురాలిని పురిగొల్పాడు. అతని దోషిత్వం పూర్తిగా నిరూపితమైంది'' అని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది.

# ఫ్రాన్స్‌తో భాగస్వామ్యం ఇక ప్రత్యేకం

ముంబయి: తమ మధ్య సంబంధాలను 'ప్రత్యేక ప్రపంచవ్యాప్త వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచాలని భారత్‌ఫ్రాన్స్ నిర్ణయించాయి. ప్రపంచంలో భౌగోళిక, రాజకీయ కల్లోల పరిస్థితుల్లో రక్షణ, వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఉన్నత సాంకేతికత రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని గణనీయంగా పెంచుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ప్రతినబూనారు. మోదీ ఆహ్వానం మేరకు మూడురోజుల పర్యటన నిమిత్తం మెక్రాన్ మంగళవారం తెల్లవారుజామున ముంబయి చేరుకున్నారు. మెక్రాన్‌ను మోదీ సాదరంగా స్వాగతించారు. లోక్‌భవన్‌లో ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడం, సరికొత్త రంగాలకు వాటిని విస్తరించడం, భాగస్వామ్యంలో పురోగతిపై సమాలోచనలు జరిపారు. ప్రాంతీయ, ప్రపంచవ్యాప్త ప్రాధాన్యమున్న అంశాలపై చర్చించారు. 21 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్‌లో హామర్ క్షిపణుల ఉత్పత్తికి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, సాఫ్రాన్ (ఫ్రాన్స్) మధ్య కుదిరిన ఒప్పందం దీనిలో ఒకటి. ఇరు దేశాల సైన్యాల మధ్య అధికారులను పరస్పరం నియుక్తం చేయడం మరొకటి. చర్చల అనంతరం మోదీ తరఫున ఒక ప్రకటన విడుదలయింది.

# తీరంలో యుద్ధ నౌకల జాతర

సింధియా: ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్‌ఆర్) సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం రాత్రి విశాఖ ఈఎన్‌సీ ఆఫీసర్స్ మెస్‌లో విందు (ప్రెసిడెన్షియల్ బాంక్వెట్) ఇచ్చారు. ఈ అంతర్జాతీయ ఉత్సవానికి హాజరవుతున్న వివిధ దేశాల నేవీ చీఫ్‌లకు దేశ రక్షణ దళాల సుప్రీం కమాండర్ హోదాలో రాష్ట్రపతి విందు ఇవ్వడం ఆనవాయితీ. ఈ విందుతో ఐఎఫ్‌ఆర్ లాంఛనంగా ప్రారంభమైనట్లు భావిస్తారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజినోవా, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, విశాఖ పోర్టు డిప్యూటీ ఛైర్మన్ రోషిణి అపరంజి, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ నేవల్ అధికారులు, ఫ్లీట్ కమాండర్లు, డీజీసీజీ, సీజీసీ(ఈఎస్), ఇతర కమాండర్లతో రాష్ట్రపతి గ్రూప్ ఫొటో దిగారు. అంతకుముందు దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ ఐఎన్‌ఎస్ డేగాకు చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు స్వాగతం పలికారు.

*** ఐఎఫ్‌ఆర్ సన్నాహక విన్యాసాల్లో యుద్ధనౌకల సందడి**

*** తుది సన్నాహకాలు పూర్తి**

ఐఎఫ్‌ఆర్‌లో భాగంగా బుధవారం ఐఎన్‌ఎస్‌సుమేధ నౌకపై రాష్ట్రపతి ప్రయాణిస్తారు. ఆరు వరుసల్లో నిలిపిన 71 యుద్ధనౌకల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం నౌకా దళం నిర్వహించిన తుది సన్నాహక విన్యాసాలను నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌ఎస్ విక్రాంత్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విక్రాంత్‌పైకి మిగ్29 జెట్ విమానాలు చేసిన ల్యాండింగ్, టేకాఫ్ విన్యాసాలు సందర్శకులను మైమరిపించాయి. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొననున్నాయి.

## వివేకానందనగర్ లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి): తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ మాధవరం కాలనీ లో గల డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల తో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందన్నారు. రైతులకు, మహిళలకు, పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారు. ఆయన చూపిన అభివృద్ధి దిశలోనే మేము పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల పెద్దభాస్కర్ రావు ,మాచర్ల భద్రయ్య, ఆంజనేయులు,బాబూరావు , ప్రవీణ్,విక్రమ్, ఈశ్వర్,వెంకట్ రెడ్డి,శ్రీనివాస్,రఘునాథ రెడ్డి, రాజు ,సిల్వర్ మనీష్, సత్యనారాయణ,బాబు, రామచందర్, సోమయ్య,కొండలరావు, అనిల్ ,లక్ష్మణ్ ,నరసింహా రెడ్డి, వాసు, విద్యాసాగర్, రామారావు, శ్రీధర్, వెంకన్న, శేఖర్, రాము, శ్రీధర్ రావు,మురళి, రాజశేఖర్, వెంకటేశ్వర రావు, జై.కుమార్ యాదవ్, శ్రీనివాస్, వాసు,విజయ్ సాగర్,కిషన్ ,సోమేష్,రాజు,.కేబుల్ రమేష్, రవీందర్, అరవింద్,నరేష్, సంతోష్, రామ్మూర్తి, రాజుయాదవ్,బిందెల్ రాము,శ్రీనివాస్ యాదవ్, సంతోష్, జగదీష్,నవీన్, వినయ్, మోహన్ చారి,రాము,సంతోష్, అనిత, శైలజ, రాధిక, కరుణ, అనురాధ,శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

* పట్టణంలో వివిధ బజారులను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.





నల్లగొండ, (ప్రజాస్ఫూర్తి) : నల్గొండ ను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంలో భాగంగా జిల్లా కేంద్రానికి గుండెకాయలా ఉన్న ప్రకాశం బజార్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు తక్షణ చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.మంగళవారం ఉదయం 4 గంటల నుండే ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని లతీఫ్ సాబ్ గుట్ట, ప్రకాశం బజార్ తదితర ప్రాంతాలను సందర్శించారు. ప్రకాశం బజార్లో ఫుట్ పాత్ పై చిరు వ్యాపారులు, పూలు ,పండ్ల వ్యాపారాలు చేసుకునేవారు డివైడర్ మధ్యలో వాటిని ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలు సంభవిస్తున్నాయని చాలా రోజుల నుండి ప్రజలు తన దృష్టికి తీసుకొస్తున్నట్లు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే డివైడర్లను తొలగించి అక్కడ వ్యాపారాలు నిర్వహించుకునే సుమారు 60 నుండి 70 మంది పూలు, పండ్లు, ఇతర చిరు వ్యాపారుల దుకాణాలన్నింటిని జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ కార్యాలయ స్థలంలోకి తరలించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అక్కడ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అనువైన స్థలం ఉందని, అంతేకాక పార్కింగ్ కి ఇబ్బంది లేదని, ప్రస్తుతం ప్రకాశం బజార్లో 60 నుండి 70 మంది చిరు వ్యాపారులు ఫుట్పాత్ పై వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారని, అలాంటి వారందరిని గుర్తించి వారికి పాత కలెక్టర్ కార్యాలయ స్థలంలో వారి షాపు పరిమాణాలను బట్టి 50, 70, 100 గజాల స్థలాలను కేటాయిస్తామని మంత్రి తెలిపారు. పాత కలెక్టర్ కార్యాలయ స్థలంలో ప్రస్తుతం ఉన్న టీఎస్ఎం పార్కింగ్ ను దేవరకొండ రోడ్ లోని హౌసింగ్ బోర్డ్ స్థలంలోకి తక్షణమే మార్చాల్సిందిగా ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రకాశం బజార్ లోని డివైడర్లను జెసిబి లో సహాయంతో అప్పటికప్పుడే తొలగించే చర్యలను చేపట్టారు. సాయంత్రంలోగా డివైడర్ తొలగింపును పూర్తి చేయాలని, అదేవిధంగా పాత కలెక్టరేట్ స్థలంలో సీసీ ఫ్లోరింగ్, మార్కింగ్, లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రకాశం బజార్లో భూగర్భ ఎలక్ట్రిసిటీ తో పాటు, సిసి రోడ్లు కొత్తగా వేయిస్తామని, ఇకపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ రద్దీ లేకుండా ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా మంత్రి స్థానిక చిరు వ్యాపారుల తో మాట్లాడారు. వ్యాపారాలు నిర్వహించుకునే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని, ముఖ్యంగా పేదలకు ఎలాంటి ఇబ్బంది కలగనివ్వమని, అందరికీ షాపులను కేటాయించి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా గులాం ఖాదర్ పండ్ల వ్యాపారి నుండి మంత్రి అప్పటికప్పుడే 30 వేల రూపాయలు చెల్లించి పండ్లను కొనుగోలు చేసి అందరికీ పంపిణీ చేశారు. ప్రకాశం బజార్లో సుమారు రోజు 10,000 మంది వ్యాపారం నిమిత్తం సందర్శిస్తుంటారని, గతంలో చిన్న వ్యాపారాలు, షాపులు ఉండేవని, ఎలాంటి రద్దీ ఉండేది కాదని జనాభా పెరగడం, వ్యాపారాలు పెరగడం వల్ల ప్రస్తుతం విపరీతమైన రద్దీ ఏర్పడి ట్రాఫిక్ తో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని డివైడర్ తొలగింపు, పూలు, పండ్ల వ్యాపారాలు, చిరు వ్యాపారులను పాత కలెక్టరేట్ కార్యాలయం స్థలంలోకి తరలించాలని చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. పేదవారికి ఎప్పుడు తాను సహాయం చేస్తానని, పేదల పక్షాన ఉంటానని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, నల్గొండ ఆర్డీఓ అశోక్ రెడ్డి, డీఎస్పీ శివరామిరెడ్డి, ట్రాన్స్కో, మున్సిపల్, తదితర అధికారులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజా బాట

- సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ప్రజా బాట కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో విద్యుత్ శాఖ డైరెక్టర్ శివాజీ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ సీఈ బాలస్వామితో కలిసి దేవలమ్మ నాగారంలో పర్యటించారు. గ్రామంలో క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరా లోపాలు, ట్రాన్స్ ఫార్మర్ల సమస్యలపై సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన అధికారులు త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనూప్ రెడ్డి, ఎస్ఈ సురేష్, డీఈ మల్లికార్జున, ఏఈ సతీష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మట్ట చెన్నయ్య గౌడ్ కు అంతర్జాతీయ పీస్ ఐకాన్ అవార్డు

నల్లగొండ ,ప్రజాస్ఫూర్తి.: ఈనెల 17వ తేదీన ఇంటర్నేషనల్ సోషల్ జస్టిస్ డే అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా చెన్నైలోని టి నగర్ సోషల్ క్లబ్లో ది అమెరికన్ యూనివర్సిటీ ప్రముఖ శాస్త్రవేత్త ఏ యూ జి పి యూఎస్ఏ వ్యవస్థాపక అధ్యక్షులు చీఫ్ రేక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మధు కృష్ణన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ పీస్ సమ్మిట్ లో మట్ట ఎల్లయ్య గౌడ్ అంజలి ట్రస్ట్ చైర్మన్ శ్రీ కృష్ణవేణి హై స్కూల్ కరస్పాండెంట్ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ మట్ట చెన్నయ్య గౌడ్ వివిధ రంగాలలో ప్రముఖులు ఈ సమ్మిట్ లో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మట్ట చెన్నయ్య గౌడ్ ను పీస్ ఐకాన్ అవార్డుతో ది అమెరికన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మట్ట చెన్నయ్య గౌడ్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉంది భవిష్యత్తులో మా ట్రస్టు ద్వారా మరికొంతమంది తల్లిదండ్రి లేని విద్యార్థిని విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామని అదేవిధంగా సస్టైనబుల్ డెవలప్మెంట్ మరియు శాంతి సోషల్ జస్టిస్ విభాగంలో మా సంస్థ మరింత కృషి చేస్తుందని తెలియజేస్తున్నాను నన్ను గుర్తించి అవార్డు బహుకరించిన ది అమెరికన్ యూనివర్సిటీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్న ప్రసాద వితరణ..



నల్లగొండ , ప్రజా స్ఫూర్తి : వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో గుండా రమేష్, గుండా భవాని ల ఆర్థిక సహకారంతో మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రోగుల సహాయకులకు సిబ్బందికి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత గుండా రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతినెల అమావాస్య రోజు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన వితరణ చేస్తున్నట్లు తెలిపారు, సుదూర ప్రాంతాల నుండి ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు అన్నదానం చేయడం సంతృప్తిని కలిగిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్స్ 104ఏ గవర్నర్ వీరెల్లి సతీష్ కుమార్, తాళ్లపల్లి రాములు, రీజియన్ చైర్ పర్సన్ వనమా గోపి కిషన్, రీజియన్ సెక్రటరీ వనమా నరసింహ, వాసవి క్లబ్ వనిత సెక్రటరీ నల్లగొండ సుచరిత, కృష్ణయ్య,వాసవి క్లబ్ స్ఫూర్తి ప్రెసిడెంట్ మిట్టపల్లి సంతోషిని, సెక్రెటరీ మురారి శెట్టి నందిని,ట్రెజరర్ విజయలక్ష్మి, సీనియర్ సిటిజన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సింగగిరి కొండ గోవర్ధన్, వాసవి క్లబ్ కే సి జి ఎఫ్ నల్గొండ ప్రెసిడెంట్. మిట్టపల్లి వాత్సవ్., సెక్రటరీ మురారి శెట్టి శంకర్, కాసం వెంకన్న, వనమా లక్ష్మయ్య, తదితర సభ్యులు పాల్గొన్నారు.



## జేఈఈ మెయిన్స్ 2026 తొలి సెషన్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఫిజిక్స్ వాలా సంచలనం

శేర్లింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : జేఈఈ మెయిన్స్ 2026 తొలి సెషన్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఫిజిక్స్ వాలా ఇన్స్టిట్యూట్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు ఈ సందర్భంగా సంస్థలో సక్సెస్ మెంట్ నిర్వహించారు. విజయోత్సాహంలో భాగంగా కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను మెడల్స్తో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల కృషిని తల్లిదండ్రులు, అధ్యాపకులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో 99.94 శాతం సాధించిన తమ విద్యార్థి సంభవ్ సురాన టాపర్గా నిలిచాడని తెలిపారు. అలాగే 10 మందికి పైగా విద్యార్థులు 99 శాతానికి పైగా, 20 మందికి పైగా విద్యార్థులు 98 శాతం, 50 మందికి పైగా విద్యార్థులు 95 శాతానికి పైగా మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్నారని వెల్లడించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఫ్యాకల్టీ నిబద్ధత, విద్యార్థుల కఠిన శ్రమ కలిసి ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు. ఒత్తిడి లేని, నాణ్యమైన బోధనకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులను జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడమే తమ లక్ష్యమని సెక్స్ వాలా ఇన్స్టిట్యూట్ యజమాన్యం తెలిపారు..ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద రామన్, సీఈఓ మునిందర్, అసిస్టెంట్ డైరెక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆట డాన్స్ షో కి సెలెక్ట్ అయిన జన్నారం నృత్యకారులు



ప్రజాస్ఫూర్తి జన్నారం : జీ తెలుగు లో అత్యంత ఆదరణ పొందిన ఆట డాన్స్ షో కి సిరి డ్యాన్స్ అకాడమీ నుండి జన్నారం మండలానికి చెందిన రుచిత,సంహిత,సత్యశ్రీ లు ఎంపికైనట్లు సిరి డాన్స్ స్టూడియో హైదరాబాద్ నిర్వాహకుడు చిటుమల్ల రాజేష్ తెలిపారు.ఆట డాన్స్ షో లో ప్రముఖ కొరియోగ్రాఫర్ శశి మాస్టర్ కు చెందిన గ్రూప్ లో డాన్స్ చేయనున్నట్లు తెలిపారు. జన్నారం మండల కేంద్రానికి చెందిన చిటుమల్ల రాజేష్ హైదరాబాద్ తూముకుంట లో ఏర్పాటు చేసిన సిరి డాన్స్ అకాడమీ నుండి ఎందరో విద్యార్థులు పలు డాన్స్ షో లకు ఎంపికైనట్లు తెలిపారు

## పోచమ్మ దేవాలయం వద్ద అమావాస్య అన్నదాన కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి , కాప్రా : కుషాయిగూడలోని పోచమ్మ దేవాలయం వద్ద అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బేతి సుభాష్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా అన్నదానం చేయడం మహా పుణ్యకార్యమని, భక్తులకు సేవ చేయడం ద్వారా సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.మారుతి మిత్ర మండలి అధ్యక్షులు గురుమంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి వర్గంటి హనుమంతు, కోశాధికారి మచ్చ బాబు, సభ్యులు కాసుల సురేష్ గౌడ్, గురుమంచి వేణుగోపాల్ చారి, ఏ. సతీష్ తదితరులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సంకూరి శ్రీనివాస్ గౌడ్, అమరచారి, అంజి యాదవ్, రఘు గౌడ్, బీజేపీ నాయకులు రవీందర్ రెడ్డి, గణేష్ ముదిరాజ్, విద్యాసాగర్ హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు. స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలి



ప్రజాస్ఫూర్తి, జన్నారం : పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మానసిక ఒత్తిడి కి గురికాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మరియు గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలో తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలకు వెళ్లే ముందు ఎలాంటి ఆందోళన కు గురికావద్దని, సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల సమయంలో సరైన నిద్ర, మంచి ఆహారం, యోగా, మెడిటేషన్ వంటివి పాటించినప్పుడు మానసిక ఒత్తిడిని నివారించవచ్చని తెలియజేశారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాల స్టోర్ రూమ్ మరియు భోజనశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామన్న, గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాజం, హెల్త్ సూపర్వైజర్ జంగమ్మ ,ఎం ఎల్ హెచ్ పి పల్లవి ,హెల్త్ అసిస్టెంట్లు కొల్లూరి కమలాకర్, ఎండి రషీద్ ఖాన్ ,సుభక్త తదితరులు పాల్గొన్నారు




## అమావాస్య అన్న ప్రసాద వితరణ – పేద వృద్ధురాళ్లకు పించన్ అందజేత

ప్రజాస్ఫూర్తి , కాప్రా : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో వాసవి మిత్రమండలి సభ్యులు ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్లో అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం ప్రతినెల పేద వృద్ధురాళ్లకు రూ. 1000 చొప్పున అందజేస్తున్న పించన్ను మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మ గార్లకు అందజేశారు. ఈ సందర్భంగా వాసవి మిత్రమండలి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్తా, ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్తా, తాటి శ్రీనివాస్ గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్తా, అమర కృష్ణ గుప్తా, చందా సంతోష్ గుప్తా, కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్ కుమార్ గుప్త, ఉప్పల ఆంజనేయులు గుప్తా, సభ్యులు ఉప్పల శ్రీనివాసులు గుప్త, బెలిదే బాగువాన్ గుప్త, రవ్వ ఈశ్వరరావు గుప్త, చంద్రగిరి తారకేశ్వర్ గుప్తా, కమిశెట్టి రామలింగం గుప్త, పెద్ది నవీన్ గుప్త, రాయల సంతోష్ గుప్తా, గజ్జల రమేష్ గుప్తా, దిడిగం కైలాసం గుప్తా, రాయికంటి ముత్యాల గుప్తా, దాచా ప్రసాద్ గుప్తా, పెద్ది శ్రీనివాస్ గుప్తా, దారం అనిల్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఆధిపత్యం

* చైర్పర్సన్గా దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్గా పెండేల రాజు ఏకగ్రీవం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్ చైర్పర్సన్ ఎంపికపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కౌన్సిలర్లతో ప్రమాణస్వీకారం అనంతరం చైర్పర్సన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2వ వార్డు కౌన్సిలర్ దొడ్డ కిరణ్ మిత్రను చైర్పర్సన్గా, 17వ వార్డు కౌన్సిలర్ పెండేల రాజును వైస్ చైర్మన్గా కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. మున్సిపాలిటీలోని 24 వార్డులకు గాను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 19 మంది, ఇద్దరు స్వతంత్రులు, ముగ్గురు భారత్ రాష్ట్ర సమితి కౌన్సిలర్లు గెలుపొందారు. అనంతరం స్వతంత్ర కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీ బలం 21కి చేరింది.

# ఐఐటీ జేఈఈ మెయిన్స్లో 'ప్రగతి' విద్యార్థుల ఉత్తమ ప్రతిభ..





ప్రజా స్ఫూర్తి, నల్గొండ :ఐఐటీ జేఈఈ మెయిన్స్ సీజన్ 1, 2026 ఫలితాలలో నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేందర్ బాబు, ఎన్. శశిధర్ రావు, చందా శ్రీనివాస్, పైళ్ళ రమేష్ రెడ్డితెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థులు డి. అభిషేక్ 97.69, పి. భువిశ్రీ 96.01. యన్. దీక్షిత్ 95.40, సి. హెచ్. రామ్ చరణ్ తేజ్ 95.21, టి.రిషి 94.81, శివాంజన్రెడ్డి 94.03, తేజ్వీర్ 93.24, సాత్విక్ 92.38. యమ్. సుఫియాన్ 91.49, చందా సుహాస్ 91.48, ఎమ్. మనోహర్ ముత్యమ్ 90.94, కె. సాయికుమార్ 90.37 పర్సంటైల్ సాధించారు. కళాశాలకు చెందిన 92 మంది విద్యార్థులు 80 పైగా పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో "ప్రగతి జూనియర్ కళాశాల" ది బెస్ట్ కళాశాల అని నిరూపించినారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులను వారి తల్లిదండ్రులను అందుకు సహకరించిన అధ్యాపక బృందానికి చైర్మన్, డైరెక్టర్లు మంగళవారం అభినందించారు.

# విద్యార్థులకు క్రీడా సామాగ్రి, డిక్షనరీల పంపిణీ



ప్రజాస్ఫూర్తి , కాప్రా : తెలంగాణ జాతిపిత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి జననేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు 72వ జన్మదినం సందర్భంగా కాప్రా డివిజన్ గాంధీనగర్లోని యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామాగ్రి , తెలుగు, హిందీ, ఇంగ్లీష్ డిక్షనరీలను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యా అభివృద్ధి మరియు క్రీడా ప్రతిభ పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా రేగళ్ల సతీష్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ బాపు చావు నోట్లో తల పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసి తెలంగాణ తల్లి ఋణం తీర్చుకున్న మహనీయుడు అని కొనియాడారు. దశాబ్దాల తెలంగాణ రాష్ట్ర కలను నెరవేర్చిన నాయకుడిగా, పసిబిడ్డ నుండి పండుముసలి వరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని దేశంలోనే అభివృద్ధి , ఆర్థికంగా ముందంజలో నిలబెట్టిన నాయకుడని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగునూరి మహేష్, కొప్పుల కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ గూడా ఇంద్రయ్య, రాజు గౌడ్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది.

# ఘనంగా తెలంగాణ జాతిపిత కేసీఆర్ జన్మదిన వేడుకలు..



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ జాతిపిత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మల్కాజ్గిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ .కార్యక్రమంలో పరశురాం రెడ్డి, వెంకన్న , నర్సింగ్ రావు, ముర్గేష్, రాము యాదవ్, చిన్న యాదవ్, సైదులు, ఖలీల్, పి. శ్రీనివాస్, సతీష్, సుధాకర్, కోటేష్, శ్రీకాంత్, జనార్దన్, నవీన్, కుమార్, ఉపేందర్, రాములు, నక్క శ్రీకాంత్, సూరి, మల్లేష్, నర్సింగ్, బాబు, వేణు యాదవ్, రజని గౌడ్, లంబూ సాయి, సాయి, కోటేశ్వర, విక్రమ్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, పిట్ల శ్రీనివాస్, లింగమన, జ్ఞానేశ్వర్, ప్రదీప్, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్, ఇబ్రహీం, అనిల్ గౌడ్, రాజ్ కుమార్ బీఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి: కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పరీక్షల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో సీఎస్, అనుభవం ఉన్న ఇన్విజిలేటర్లను నియమించాలన్నారు. పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్లలో స్ట్రాంగ్ రూమ్లు ఏర్పాటు చేయాలని ఆదేశిం చారు. కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి అమలు చేయడంతో పాటు సీసీ కెమెరాల నిఘా కొనసాగించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలన్నారు. జవాబు పత్రాలను భద్రతా ప్రమాణాలతో మూల్యాంకన కేంద్రాలకు పంపించేందుకు పోస్టల్ శాఖ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పరీక్ష రోజుల్లో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్, వైద్య సదుపాయాలు, తాగు నీరు, పారిశుధ్యం కల్పించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. విద్యార్థులు పరీక్షకు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీఐఈఓ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సులోచన రాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పరిపాలనలో మంచి దక్షతను సంపాదించాలి

***జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



నలగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ అభివృద్ధి ,సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించేందుకు పాలనలో మంచి దక్షతను సంపాదించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ప్రొబేషనరీ గ్రూప్ 1 అధికారులకు సూచించారు.మంగళవారం సుమారు 54 మంది ప్రొబేషనరీ గ్రూప్ 1 అధికారులు శిక్షణలో భాగంగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో మంగళ బుధ రెండు రోజులపాటు శిక్షణ పొందే నిమిత్తం జిల్లాకు రావడం జరిగింది.ముందుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వారితో సమావేశమైన జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా వివరాలను, తెలియజేశారు.తెలంగాణలోనే నల్గొండ జిల్లా అతిపెద్ద జిల్లా అని, 566 రెవెన్యూ గ్రామాలు, 869 గ్రామపంచాయతీలు ఉన్నాయని, 2011 జనాభా లెక్కల ప్రకారం 16 లక్షల 18 వేల జనాభా ఉందని, 61% అక్షరాస్యత ఉన్న జిల్లాలో సుమారు 77% ప్రజలు వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారని, జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతాలు, నాగర్జున సాగర్ ప్రాజెక్టు కింది కమాండ్ ఏరియాలో ఉండే మిర్యాలగూడ, నాగార్జునసాగర్ వంటి ప్రాంతాలు ఉన్నాయని, మారుమూల గిరిజన ప్రాంతాలలో కమ్యూనికేషన్ సదుపాయాలు కొన్ని గ్రామాలలో ఉన్నాయని తెలిపారు. గ్రూప్ 1 శిక్షణ అధికారులు వారి శిక్షణలో భాగంగా గ్రామాలకు వెళ్లి అధ్యయనం చేసిన అనంతరం ముఖ్యమైన పారామీటర్స్ పై నివేదిక తయారు చేసుకోవాలని, ఇది భవిష్యత్తు పరిపాలనలో ఎంతోఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలో అమలు చేస్తున్న అనేక పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని, అంతేకాక కేంద్ర ప్రభుత్వం ద్వారా కూడా కొన్ని పథకాలు అమలు అవుతున్నాయని ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలు, ఉపాధి హామీతో మొదలుకొని, పెన్షన్లు అన్ని పథకాల కింద లబ్దిని నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్ కి జమ చేయడం జరుగుతున్నదని, సన్న దాన్యం పండించిన రైతులకు క్వింటాలుకు 500/ రూపాయల బోనస్ ఇస్తున్నదని, అన్ని పథకాలలో మధ్య దళారీ వ్యవస్థ లేదని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి వంటి ఎన్నో ప్రతిష్టాత్మక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వీటన్నిటిపై అధ్యయనం చేసి భవిష్యత్తులో ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కృషి చేయాలని ప్రొభేషనరీ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ శిక్షణ భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని, అందువల్ల ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.కాగా 54 మంది శిక్షణ గ్రూపు 1 అధికారులు మంగళ బుధ రెండు రోజులపాటు జిల్లాలోని కొండమల్లేపల్లి మండలం చెన్నమనేనిపల్లి, పీఏ పల్లి మండలం ఆర్ఆర్ గూడెం, చింతపల్లి మండలంలోని గొల్లపల్లి, దేవరకొండ మండలం మైనంపల్లి, తూర్పుపల్లి, వేములపల్లి మండలం శెట్టి పాలెం, లక్ష్మీదేవి గూడెం, మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్, యాద్గార్ పల్లిలలో సందర్శించి గ్రామీణ ప్రాంతంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, గ్రామీణ జీవన విధానాన్ని అధ్యయనం చేయనున్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు, ఎం సి హెచ్ ఆర్ డి కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.




# గ్రామాభివృద్ధికి సర్పంచులు ముందుండాలి

**: కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గ్రామాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నూతన సర్పంచుల కోసం నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ కార్యక్రమం కెఎస్ఎం పాత క్యాంపస్లో జరిగింది. జిల్లాలోని 471 మంది సర్పంచులకు విడతల వారీగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. రెండో విడత శిక్షణ ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు కొనసాగనుంది. ఈ విడతలో అశ్వరావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన 233 మంది సర్పంచులు పాల్గొంటున్నారు. పంచాయతీ రాజ్ చట్టం, ఆర్థిక నిర్వహణ, పారదర్శక పాలన, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలుపై అవగాహన కల్పించనున్నారు.తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణతో పాటు చిన్నారులు, బాలింతలకు పోషకాహారం అందేలా చూడాలని తెలిపారు. పర్యాటక అవకాశాల వినియోగంతో గ్రామాల ఆర్థికాభివృద్ధి సాధ్యమని, పశుసంపద అభివృద్ధి, చెట్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని సర్పంచులకు సూచించారు.ఈ సందర్భంగా సర్పంచులకు శిక్షణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీఓ సుధీర్, అనూష తదితరులు పాల్గొన్నారు.



# గుండెపోటుతో మృతి చెందిన
## విలేకరి కుటుంబానికి రూ. 8 లక్షల ఆర్థిక సహాయం

*** షాబాద్ జర్నలిస్టుల సమిష్టి కృషి అభినందనీయం: జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా**

(రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి) : గుండె పోటుతో మృతి చెందిన షాబాద్ మండల ఆంధ్రప్రభ రిపోర్టర్ రాములు మృతి ఎంతో బాధాకరమని రంగారెడ్డి జిల్లా టీ యూ డబ్ల్యూ జే అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా అన్నారు.మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన షాబాద్ మండల ఆంధ్రప్రభ రిపోర్టర్ కడుమూరి రాములు కు సోమవారం రోజు షాబాద్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా,జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీమ్ భరత్, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, హోప్ ఫౌండేషన్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్, మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. టీయూడబ్ల్యూజే ఐజేయు షాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో రాములు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఆంధ్రప్రభ యాజమాన్యం మరియు నాయకులు అందరు కలిసి రాములు కుటుంబానికి రూ.8 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచారు.రాములు సతీమణి అలివేలు, కుమారులు వంశీ కృష్ణ, సాయికృష్ణలకు నగదు అందించారు. ఈ సందర్భంగా రాములు కుటుంబానికి అండగా నిలిచిన షాబాద్ మండల జర్నలిస్టులకు జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా అభినందనలు తెలిపారు. పని వత్తిడి మూలంగా ఎవరు కూడా ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేయవద్దని, జిల్లా లోని జర్నలిస్ట్ లకు వైద్య శిబిరాలు నిర్వహించి పలు రకాల పరిక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు.చేవెళ్ల లో కూడా త్వరలో వైద్య శిభిరాన్ని నిర్వహిస్తామన్నారు.ప్రభుత్వం వెంటనే కార్పొరేట్ అస్పత్రుల్లో జర్నలిస్ట్ లకు ఉచిత వైద్యాన్ని అందించి ప్రాణాలు కాపాడాలన్నారు.మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ద్వారా అకాడమీ నుంచి కూడా రాములు కుటుంబానికి లక్ష రూపాయల సహాయం అందించటానికి కృషి చేస్తామన్నారు.ఈ సంతాప సభలో స్థానిక సిఐ తో పాటు కురుమ సంఘం నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఆయా గ్రామాల సర్పంచ్ లు,మాజీ ప్రజాప్రతినిధులు, చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు యాదయ్య, షాబాద్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాంచంద్రయ్య, నియోజకవర్గ జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, జన్నారం: జన్నారం మండల బిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకుడు, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గుర్రం రాజారామ్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సులవ జనార్దన్ ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు,చేపట్టిన అభివృద్ధి పనులు తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు.అబద్ధపు హామీలతో గద్దనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని, మునుముందు తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ గులాబీ జెండా ఎగరవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ముమ్మాటి సంతోష్,సుతారి వినయ్,జాడి గంగాధర్,భరత్ కుమార్,చెటుపెల్లి సత్యం, శ్రీనివాస్ గౌడ్,సాయిని ప్రసాద్ నేత,తదితరులు పాల్గొన్నారు.

*** ప్రభుత్వ పాఠశాలలో నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ**

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా బిఆర్ఎస్ యువ నాయకుడు కొట్టే హరికృష్ణ మండలంలోని తొమ్మిది గుడిసెల పల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులకు కానుకగా పెన్నులు, నోట్ బుక్కులు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.

# చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్యను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



చేవెళ్ళ , ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చేవెళ్ల, శంకర్ పల్లి, మొయినాబాద్ మునిసిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను చైర్ పర్సన్లు గా ఎన్నుకోవడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే యాదయ్య ని ప్రత్యేకంగా అభినందించి మూడు మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కాల యాదయ్య తెలిపారు




# జగద్గిరిగుట్టలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర సాధకులు, బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ 72వ జన్మదినం సందర్భంగా మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ లాస్ట్ బస్టాప్ లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ మాజీ హైట్రిక్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ ను కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, రుద్ర అశోక్ మాజీ అధ్యక్షులు, మల్లేష్ గౌడ్. బొగ్గుల సురేష్. మల్లారెడ్డి. నాయకులు. కొలుకుల జైహింద్. వేణు యాదవ్. పాపయ్య గౌడ్. విట్టల్ ముదిరాజ్. గిరి. నాగరాజు. మహేందర్ రెడ్డి. సాజిత్. మనోజ్ బసవేశ్వర్ గణేష్. సంపత్ రెడ్డి. సునీల్ రెడ్డి. రాయి విగ్నేష్. భోగ రాజేష్. మహేష్. మనోజ్ ప్రభాకర్. రామరాజు. కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ జోన్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

* **పట్టుబడిన ట్యాక్స్ ఇన్స్పెక్టర్**
* **కుత్బుల్లాపూర్ జోన్ కార్యాలయంలో ఏసీబీ దాడులు**
* **పట్టుబడిన ట్యాక్స్ ఇన్స్పెక్టర్**

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : ఆస్తి మార్పిడికి లంచం అడిగిన ట్యాక్స్ ఇన్స్పెక్టర్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ పట్టుబడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను రంగారెడ్డి రెంజ్ ఏసీబీ డిఎస్పీ ఆనంద్ కుమార్ వెల్లడించారు. కుత్బుల్లాపూర్ జోన్ చింతల్ సర్కిల్ పరిధి భగత్సింగ్ నగర్లో గత నాలుగు సంవత్సరాల కిందట ఇళ్ళు కొనుగోలు చేశారు. సదరు ఇంటికి సంబంధించిన ఆస్తి పన్ను అసెస్మెంట్ చేయాల్సి ఉంది. పాత ఇంటి యజమాన్ని పేరు మీద ఉన్న ప్రాపర్టీని తన పేరు మీదకు మార్చుకోవడానికి మూటేషన్ దరఖాస్తు చేసుకున్నారు. చింతల్ సర్కిల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ,ట్యాక్స్ ఇన్స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్న వహీద్ ను సంప్రదించగా రూ.2.70 వేల పన్ను చెల్లించాల్సి ఉంటుందని, బాధితుడికి నోటిసు ఇచ్చాడు. ఇంత పెద్ద మొత్తంలో పన్నురావడంతో సదరు బాధితుడు కంగు తిన్నాడు. దీంతో ఆసరాగా చేసుకున్న






సదరు అధికారి పన్ను మొత్తాన్ని గణనీయంగా తగ్గించడానికి రికార్డుల్లో పేరు మార్పుడి ప్రక్రియను పూర్తి చేయడానికి అధికారి వాహిద్ భాధితుడి నుంచి లక్ష రూపాయాలు డిమాండ్ చేశారు. బాధితుడు అంత ఇచ్చుకోలేనని ప్రాధేయ పడడంతో ఒప్పందం ప్రకారం రూ.90 వేలు బేరం కుదిరింది. ఇందులో భాగంగా ముందస్తుగా బాధితుడు రూ.10 వేలు ఇచ్చుకున్నారు. కానీ మిగతి మొత్తాన్ని ఇచ్చుకోవాలని భాధితుడికి సదరు అధికారి నిత్యం ఫోన్ చేసి వేధింపులకు గురి చేశాడు. చివరకు రూ.75 వేలు మాత్రమే ఇవ్వగలనని చివరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. భాధితుడికి మిగిలిన మొత్తాన్ని ఇవ్వడం ఇష్టం లేక తన వద్ద లంచం వసూళ్ళు చేసేందుకు సదరు అధికారి వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. భాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి విచారణ నిమిత్తం బాధితుడి వద్ద ముందస్తుగా ఇచ్చిన డబ్బుల అధారంగా రంగంలోకి దిగారు. ఈ మేరకు పూర్తి విచారణలో దోషులని తెలితే అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏసీబీ డిఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు.





## శివుడి ప్రసాదంగా మాదకద్రవ్యాలు.. సజ్జనార్ సీరియస్

* **శివుడికి గంజాయితో నైవేద్యం పెడుతూ రీల్ చేసిన యువకులు**
* **సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడంతో తీవ్ర ఆగ్రహం**
* **స్పందించిన సీపీ సజ్జనార్, కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**
* **రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురు యువకుల అరెస్ట్**

మహా శివరాత్రి పర్వదినాన శివుడికి మాదకద్రవ్యాలను నైవేద్యంగా పెడుతున్నట్లు చిత్రీకరించి, సోషల్ మీడియాలో రీల్ చేసిన ముగ్గురు యువకులను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని, నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించిన కొద్ది గంటల్లోనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, మహా శివరాత్రి రోజున కొందరు యువకులు శివుడి విగ్రహం ముందు గంజాయిని ఉంచి, దానిని 'ప్రసాదం' అంటూ ఓ వీడియో రీల్ రూపొందించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వ్యాప్తి చెందడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ ఘటనపై సీపీ సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. "లైక్స్ కోసం లోకాన్ని మరిచి, వ్యూస్ కోసం విలువలను వదిలేస్తారా? ఇది కటకటాల వెనుకకు చేర్చే తీవ్రమైన నేరం. ఇలాంటి చర్యలను ఏమాత్రం సహించం" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. సీపీ పోస్టుతో వెంటనే రంగంలోకి దిగిన చార్మినార్ జోన్ టాస్క్ఫోర్స్ పోలీసులు, ఫలక్నుమా జంగంమెట్కు చెందిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తదుపరి విచారణ నిమిత్తం ఫలక్నుమా పోలీస్ స్టేషన్కు తరలించారు. క్షణికానందం కోసం యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, సోషల్ మీడియాను సృజనాత్మకతకు వేదికగా మార్చుకోవాలని సీపీ సజ్జనార్ సూచించారు.

## తెలుగు రాష్ట్రాల్లో ముస్లిం ఉద్యోగులకు శుభవార్త

* **రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు గంట ముందుగా సెలవు**
* **తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులు**
* **తెలంగాణలో ఉర్దూ పాఠశాలల సమయాల్లో మార్పులు**
* **అత్యవసర సేవలు మినహా అందరికీ వర్తింపు**
* **ప్రార్థనల కోసం ఈ వెసులుబాటు కల్పించిన ప్రభుత్వాలు**



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ముస్లిం ఉద్యోగులకు వెసులుబాటు కల్పించింది. విధులకు గంట ముందుగా హాజరయ్యేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇదే తరహా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం ఒక మెమో జారీ చేశారు. దీని ప్రకారం, ఫిబ్రవరి 19 నుంచి మార్చి 20 వరకు ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బంది, బోర్డులు/కార్పొరేషన్ల ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకు కార్యాలయాల నుంచి వెళ్ళిపోవచ్చు. అత్యవసర సేవలు అవసరమైనప్పుడు మినహా ఈ వెసులుబాటు వర్తిస్తుంది. మరోవైపు, తెలంగాణలో ఉర్దూ మీడియం పాఠశాలల సమయాల్లో కూడా మార్పులు చేశారు. ఉర్దూ మీడియం పాఠశాలలు, డైట్ కాలేజీలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పనిచేస్తాయి. ఇక ఆంధ్రప్రదేశ్లో ప్రభుత్వం ఇప్పటికే ఈ వెసులుబాటు కల్పించింది. ఫిబ్రవరి 18 నుంచి మార్చి 19 వరకు ముస్లిం ఉద్యోగులు గంట ముందుగా వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ విభాగాలు, గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి కూడా ఇది వర్తిస్తుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్ గతంలోనే తెలిపారు. రంజాన్ మాసంలో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పష్టం చేశాయి.

## 'ఐబొమ్మ' రవికి బెయిల్ మంజూరు... కోర్టు షరతులు ఇవే!

* **ఐబొమ్మ పైరసీ కేసులో ప్రధాన నిందితుడు రవికి బెయిల్**
* **షరతులతో కూడిన బెయిల్ను మంజూరు చేసిన నాంపల్లి కోర్టు**
* **పాస్పోర్ట్ స్వాధీనం చేయాలని, దేశం విడవొద్దని ఆదేశం**
* **ఇంటర్నెట్ వినియోగించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి**
* **గతంలో రవి బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన కోర్టులు**





సినిమా పైరసీ కేసులో సంచలనం సృష్టించిన 'ఐబొమ్మ' వెబ్సైట్ నిర్వాహకుడు ఇమంది రవికి ఎట్టకేలకు ఊరట లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అతనికి హైదరాబాద్లోని నాంపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది నవంబర్లో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రవిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దక్షిణ భారత సినిమాలు, ఓటీటీ కంటెంట్ను అక్రమంగా అప్లోడ్ చేస్తూ సినీ పరిశ్రమకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించాడనే ఆరోపణలతో రవిపై ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో అరెస్టయిన నాటి నుంచి రవి జైల్లోనే ఉన్నాడు. గతంలో అతని బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు, హైకోర్టు తిరస్కరించాయి. తాజాగా మరోసారి దాఖలు చేసిన పిటిషన్పై విచారణ జరిపిన న్యాయస్థానం, కఠిన షరతులతో బెయిల్కు అంగీకరించింది.

**కోర్టు విధించిన షరతులు**

పాస్పోర్ట్ను కోర్టుకు సరెండర్ చేయాలి. ప్రతిరోజూ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసుల ముందు హాజరు కావాలి. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదు. ఇంటర్నెట్ వినియోగించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ నిబంధనలకు కట్టుబడి ఉండాలన్న ఆదేశాలతో రవి జైలు నుంచి బయటకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. ఐబొమ్మ సైట్ వల్ల కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే పైరసీకి గురవుతుండటంతో చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో రవికి బెయిల్ లభించడం కేసులో కీలక పరిణామంగా మారింది.

## కేసీఆర్ కు గ్రీన్ సెల్యూట్... వినూత్న రీతిలో పుట్టినరోజు శుభాకాంక్షలు

* **గ్రీన్ ఇండియా ఛాలెంజ్లో భాగంగా 10,000 మడ అడవుల మొక్కల పెంపకం**
* **తెలంగాణ 'హరితహారం' స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పర్యావరణ ఉద్యమం**
* **అధునాతన టెక్నాలజీతో మడ అడవుల పునరుద్ధరణ పనులు**



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) 72వ జన్మదినం సందర్భంగా ఆయనకు ఒక వినూత్న హరిత కానుక అందింది. ఆయన పర్యావరణ దార్శనికత స్ఫూర్తితో, ప్రపంచంలోనే అత్యంత కీలకమైన పర్యావరణ ప్రాంతాల్లో ఒకటైన సుందర్బన్స్లో భారీ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్లో భాగంగా, కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని సుందర్బన్స్లో 10,000 మడ అడవుల (మాంగ్రూవ్) మొక్కలను నాటారు. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని గంగబ్రహ్మపుత్రమేఘన డెల్టాలో సుమారు 10,000 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న సుందర్బన్స్, ప్రపంచంలోనే అతిపెద్ద మడ అడవుల పర్యావరణ వ్యవస్థగా ప్రసిద్ధి చెందింది. ఈ అడవులు తుపానులు, సముద్రపు అలల తాకిడి, తీర ప్రాంత కోత నుంచి లక్షలాది మందికి సహజ రక్షణ కవచంలా నిలుస్తున్నాయి. అయితే, పెరుగుతున్న సముద్ర మట్టాలు, వాతావరణ మార్పుల కారణంగా ఈ ప్రాంతం తీవ్రమైన ప్రమాదాలను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ మడ అడవులను బలోపేతం చేయడం అత్యవసరంగా మారింది. కేసీఆర్ తెలంగాణలో ప్రారంభించిన 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమమే ఈ బృహత్తర ఉద్యమానికి అసలు స్ఫూర్తి. పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వ విధానంలో అంతర్భాగం చేసిన కేసీఆర్, హరితహారాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ఒక ప్రజా ఉద్యమంగా మలిచారు. ఈ స్ఫూర్తితోనే మాజీ రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'ను ప్రారంభించి, దానిని దేశవ్యాప్త ఉద్యమంగా మార్చారు. సుందర్బన్స్లో చేపట్టిన ఈ కార్యక్రమం కేవలం లాంఛనప్రాయమైనది కాదు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దీనికి జోడించారు. నాటిన మొక్కల మనుగడను పర్యవేక్షించేందుకు జియోట్యాగింగ్, వాతావరణ మార్పులను గమనించేందుకు మైక్రోక్లైమేట్ సెన్సార్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి వినియోగిస్తున్నారు. తెలంగాణలో మొదలైన హరిత స్ఫూర్తి, దేశ సరిహద్దుల్లోని సుందర్బన్స్ పరిరక్షణ వరకు విస్తరించడం కేసీఆర్ పర్యావరణ దార్శనికతకు నిదర్శనంగా నిలుస్తోంది.

## రాజకీయాల్లో ఉండాలా, వద్దా అనేది అర్థం కావడం లేదు ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీరు

* **తొర్రూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ వశం కావడంపై కంటతడి**
* **అప్రజాస్వామికంగా మున్సిపాలిటీని కైవసం చేసుకున్నారని ఆరోపణ**
* **కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పాలన్న ఎర్రబెల్లి**



తొర్రూరులో జరిగిన మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక తీరును చూశాక రాజకీయాల్లో ఉండాలా, వద్దా అనేది అర్థం కావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. తొర్రూరులో 16 వార్డులకు గాను 9 బీఆర్ఎస్, 7 కాంగ్రెస్ గెలుచుకున్నాయి. ఎక్స్అఫీషియో ఓట్లతో కలిపి రెండు పార్టీల బలాలు సమానమయ్యాయి. దీంతో లాటరీ తీయడంతో కాంగ్రెస్ రెండో వార్డు కౌన్సిలర్ శ్రావణ్ కుమార్ ఛైర్మన్ అయ్యారు. ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో తొర్రూరులో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఓ సమయంలో ఎర్రబెల్లి దయాకర్ రావుతో పాటు, పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ మున్సిపాలిటీని దక్కించుకుంది. తొర్రూరు మున్సిపాలిటీని కోల్పోవడంతో ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగాలకు లోనయ్యారు. రేయింబవళ్లు పార్టీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పాలని రోదిస్తూ అక్కడున్న పోలీసులను ప్రశ్నించారు. పోలీసుల తీరు సరిగ్గా లేదని అన్నారు. ఇంత అరాచకంగా ఎన్నికలు నిర్వహించడమేమిటని ప్రశ్నించారు. కార్యకర్తలు తెగించి పోరాడారని అన్నారు. పోలీసులు రాజ్యాంగ విరుద్ధంగా పని చేశారని అసహనం వ్యక్తం చేశారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత దగా, మోసం చూడలేదని కన్నీరు పెట్టుకున్నారు. ఎన్నిక అప్రజాస్వామికంగా నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి చూస్తుంటే రాజకీయాల్లో ఉండాలో, వద్దో కూడా అర్థం కావడం లేదని అన్నారు. తొర్రూరు ప్రజలు తమకు పట్టం కడితే ఈ ప్రభుత్వం అన్యాయంగా మున్సిపాలిటీని దక్కించుకుందని అన్నారు. తనను, తన భార్యను అన్యాయంగా అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొర్రూరులోని తన కార్యాలయానికి కూడా వెళ్లనీయడం లేదని ఆరోపించారు. విప్ జారీ చేయకుండా అన్యాయంగా అరెస్టు చేశారని అన్నారు.

## కేసీఆర్‌ది ఏ జాతి అంటావా.. ఇదే మా జాతి: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు


* **కేసీఆర్‌ది ఏ జాతి, జాతిపిత ఎలా అవుతారని ఇటీవల రేవంత్ రెడ్డి వ్యాఖ్య**
* **మాది రాణీ రుద్రమ, సమ్మక్క-సారక్కల జాతి అన్న కేటీఆర్**
* **సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని ప్రశ్న**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారని, ఆయన ఏ జాతికి జాతిపిత అని ఎద్దేవా చేస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది రాణీ రుద్రమ, సమ్మక్క సారక్క, దొడ్డి కొమురయ్య వంటి తెలంగాణ మహాపురుషుల జాతి అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తాము ప్రతిపక్షంలోకి వచ్చాక కేసీఆర్‌ను తూలనాడుతూ కొంతమంది వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ జాతి గురించి అడుగుతున్నారని, కానీ తెలంగాణ మట్టితో మమేకమైన వారికి, ఉద్యమాల ఉగ్గుపాలు తాగిన వారికి, ఆత్మగౌరవ పోరాటంలో కలిసి నడిచిన వారికి మాత్రమే జాతి అంటే ఏమిటో తెలుస్తుందని అన్నారు. కానీ సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని అన్నారు. ఇటీవల ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌ది ఏ జాతి, ఎవరికి జాతిపిత అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో తెలంగాణ వాదుల జాతి, తెలంగాణ ద్రోహుల జాతులు ఉన్నాయని అన్నారు. "సమైక్యాంధ్రవాదుల సంచులు మోసే సన్నాసులకు జాతి తెలియదు. నీతి తెలియదు. లాఠీ దెబ్బలు తిన్నవారికి, జైళ్లకు వెళ్లిన వారికి, తుపాకీలకు ఎదురొడ్డి నిలబడ్డ వారికి జాతి అంటే, జాతి అస్థిత్వం అంటే ఏమిటో తెలుసు. ఉద్యమకారుల పైకి తుపాకులు తీసుకెళ్లిన ద్రోహులకు జాతి నిర్వచనం ఎలా తెలుస్తుంది. రక్తంలో పౌరుషం ఉంటే, డీఎన్ఏలో ఉద్యమం ఉంటే ఆత్మాభిమానం అనేది ఎక్కడైనా నీ శరీరంలో ఉంటే నీకు జాతి అంటే ఏమిటో, జాతి చరిత్ర అంటే ఏమిటో తెలుస్తుంది. కానీ జై తెలంగాణ నినాదం ఇవ్వడానికే భయపడేవారికి, తెలంగాణ సోయిలేని సన్నాసులకు జాతి విలువ ఎన్నటికీ తెలియదు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు.



"కొందరు అడుగుతున్నారు నీది ఏ జాతి అని. ఏ జాతికి జాతి పిత అని అడుగుతున్నారు. వారికి నేను సమాధానం చెబుతున్నాను. ఏ జాతి అనే అల్పుడికి నేను చెబుతున్నాను. రాజ్యతంత్రం నడిపిన రుద్రమ జాతి మాది. జల్ జంగల్ జమీన్ అని కొట్లాడిన కొమురంభీం, అస్తిత్వం కోసం అమరులైన సమ్మక్క, సారక్క, కోటల మీద జెండా ఎగురవేసిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయిపాపన్న, భూస్వాముల దోపిడి మీద కొట్లాడిన దొడ్డి కొమురయ్య, బరిలో బందూకు పట్టి దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ, సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డి వర్మ, సిపాయిల తిరుగుబాటు బావుటా ఎగురవేసిన తుర్రెబాజ్ ఖాన్, ప్రాంతం వాడు మోసం చేస్తే ప్రాంతంలోనే ఉప్పుపాతర వేస్తామన్న కాళోజీ, నా తెలంగాణ కోటి రతనాల అన్న దాశరథి, విద్యార్థి అమరవీరుల జాతి మాది" అని కేటీఆర్ ఉద్ఘాటించారు.


## హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం.. టిప్పర్ కిందపడి విద్యార్థి మృతి



హైదరాబాద్‌లో విషాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందాడు. నాదర్‌గుల్ నుంచి కాలేజీకి ద్విచక్ర వాహనంపై వెళుతున్న విద్యార్థి ప్రమాదవశాత్తు టిప్పర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని నాదర్‌గుల్ నివాసి వర్ధన్‌గా గుర్తించారు. వర్ధన్ బాలాపూర్‌లోని ఒక ప్రైవేటు కాలేజీలో ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ద్విచక్ర వాహనంపై కాలేజీకి వెళుతుండగా టిప్పర్, ఆటో మధ్యలో నుంచి వాటిని దాటే ప్రయత్నంలో టిప్పర్ ముందు చక్రం కిందపడి మృతి చెందాడు. వర్ధన్ టిప్పర్‌ను దాటుదామనుకున్న సమయంలో ఆటో నిలబడి ఉంది. కానీ అంతలోనే ఆటో కదలడంతో బైక్‌ను కొద్దిగా టిప్పర్ వైపు తిప్పడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# యూనస్ నోట మళ్లీ 'సెవెన్ సిస్టర్స్'.. వెళ్లిపోతూ భారత్‌పై కవ్వింపులు

బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఇప్పటివరకు తాత్కాలిక ప్రభుత్వ సారథిగా ఉన్న మహమ్మద్ యూనస్ సోమవారం తన పదవి నుంచి వైదొలిగారు. ఈ సందర్భంగా దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అయితే, అందులో ఆయన మరోసారి భారత వ్యతిరేక వైఖరిని ప్రదర్శించారు. మన ఈశాన్య రాష్ట్రాలైన 'సెవెన్ సిస్టర్స్'ను ప్రస్తావిస్తూ అక్కసు వెళ్లగక్కారు. "విశాల సముద్రం మా దేశానికి కేవలం భౌగోళిక సరిహద్దు మాత్రమే కాదు. ప్రపంచ ఆర్థికవ్యవస్థతో అనుసంధానం కావడానికి బంగ్లాదేశ్‌కు ఉన్న మార్గం అది. నేపాల్, భూటాన్, సెవెన్ సిస్టర్స్‌తో కలిసి ఈ ప్రాంతం గొప్ప ఆర్థిక సామర్థ్యాన్ని కలిగిఉంది" అని యూనస్ తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు. భారత్ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. మన ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్‌తో కలిపి ఓ సబ్‌రీజియన్‌గా పేర్కొనడం రెచ్చగొట్టే చర్యేనని స్పష్టమవుతోంది. మన దేశంపై యూనస్ ఇలా నోరు పారేసుకోవడం కొత్తేం కాదు. గతంలో చైనా పర్యటన సందర్భంగా భారత ఈశాన్య రాష్ట్రాల గురించి ప్రస్తావించారు. ఈ రాష్ట్రాల వారు సముద్రానికి చేరుకోవడానికి వేరే మార్గం లేదని,



ఈ ప్రాంతంలో సముద్రానికి తామే రక్షకులమని అన్నారు. చైనా ఆర్థిక బేస్‌ను విస్తరించుకోవడానికి ఇది భారీ అవకాశం అంటూ కవ్వింపులకు పాల్పడ్డారు. ఈ వ్యాఖ్యలను నాడు భారత్ తీవ్రంగా ఖండించింది. ఈశాన్య రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయా, మిజోరం, నాగాలాండ్, త్రిపురను సెవెన్ సిస్టర్స్‌గా పిలుస్తారని తెలిసిందే. ఇదిలాఉండగా.. బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన బీఎన్‌పీ మంగళవారం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. బీఎన్‌పీ నేత తారిఖ్ రెహ్మాన్ నూతన ప్రధానిగా నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. 2024లో విద్యార్థుల ఆందోళనలతో మాజీ ప్రధాని షేక్ హసీనా గద్దె దిగిన సంగతి తెలిసిందే. అనంతరం ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వానికి యూనస్ సారథ్యం వహించారు. 18 నెలల పాటు ఆయన నేతృత్వంలో పాలన సాగింది. ఈ క్రమంలోనే అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. సోమవారం తన బాధ్యతల నుంచి వైదొలుగుతూ.. బంగ్లాదేశ్ ఏమాత్రం లొంగిపోయే దేశం కాదని వ్యాఖ్యానించారు. ఇతర దేశాల సలహాలు, సూచనలతో తమ ప్రభుత్వం పనిచేయబోదని వెల్లడించారు.

## కమల్‌హాసన్ 'ఎంఎన్ఎం' పార్టీకి టార్చ్‌లైట్ గుర్తు

కమల్ హాసన్ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీకి భారత ఎన్నికల సంఘం టార్చ్‌లైట్ గుర్తును కేటాయించింది. పుదుచ్చేరిలో ఎన్నికల కోసం ఈ గుర్తును కేటాయించినట్లు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో అక్కడ అన్ని నియోజకవర్గాల్లో ఈ గుర్తుతో ఎంఎన్ఎం బరిలోకి దిగనుంది. ఈ ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుర్తింపుపొందని రాజకీయ పార్టీలు గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ ఇటీవల కోరిన సంగతి తెలిసిందే. ఈ మేరకు.. దిల్లీలోని ప్రధాన ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఎంఎన్ఎం పార్టీ పది చిహ్నాలు ఉన్న జాబితాను అందించి, వాటిలో ఒక దానిని కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. తమిళనాడులో జరగనున్న ఎన్నికల్లో కూడా ఈ పార్టీ ఇదే గుర్తుతో పోటీ



చేయనుంది. అవినీతిని నిరోధించడమే లక్ష్యంగా కమల్‌హాసన్ 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించిన సంగతి తెలిసిందే.

## పిల్లలపై లైంగిక వేధింపులు.. అమెరికాలో భారతీయుడి అరెస్ట్

పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో భారత్‌కు చెందిన ఓ వ్యక్తి అమెరికాలో అరెస్ట్ అయ్యాడు. నిందితుడిని ఓడెల యశస్వీ కొత్తపల్లిగా గుర్తించారు. సరైన పత్రాలు లేకుండా అతడు అగ్రరాజ్యంలోకి ప్రవేశించినట్లు అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ప్రకటన విడుదల చేశారు. న్యూజెర్సీలో 13 ఏళ్ల లోపు చిన్నారులను నిందితుడు లైంగికంగా వేధించినట్లు అభియోగాలు నమోదయ్యాయి. అంతేగాక.. దొంగతనాలు, శాంతి భద్రతలకు భంగం



కలిగించడం వంటి నేరాలతోనూ అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే, నిందితుడిపై కేసు ఎక్కడ నమోదైంది?, ఎప్పుడు అరెస్ట్ చేశారు? వంటి పూర్తి వివరాలను మాత్రం అమెరికా (USA) ఇమిగ్రేషన్ అధికారులు వెల్లడించలేదు. ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, అతడిని దేశం నుంచి బహిష్కరించేందుకు న్యాయపరమైన ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలోకి ప్రవేశించారన్న కారణంతో గతేడాది పెద్దసంఖ్యలో భారతీయులను అగ్రరాజ్యం నుంచి వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే. దాదాపు 3,800 మంది భారత పౌరులను అమెరికా స్వదేశానికి తిప్పిపంపింది.

## ఏప్రిల్‌లో బెంగాల్, తమిళనాడు ఎన్నికలు..!

పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు ఎన్నికల కమిషన్ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు రాష్ట్రాలతో పాటు అస్సాం, కేరళ, పుదుచ్చేరిలలో ఒకేసారి పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ ను మార్చి మధ్యలో ఈసీ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల సన్నద్ధతను అంచనా వేయడానికి ఈసీ అధికారులు ఇప్పటికే పర్యటన ప్రారంభించారు. ప్రస్తుతం అస్సాంలో ఉన్నారు. పుదుచ్చేరి అసెంబ్లీ పదవీకాలం జూన్ 15న ముగుస్తుండగా.. అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌ల పదవీకాలాలు మేలో ముగుస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ఈసీ నిర్వహిస్తోన్న 'సర్' ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. పుదుచ్చేరి ఓటర్ల తుది జాబితాను ఫిబ్రవరి 14న ప్రచురించింది.




తమిళనాడు తుది జాబితాను నేడు విడుదల చేయనుంది. అస్సాంలో ఫిబ్రవరి 10న, కేరళలో ఫిబ్రవరి 21న, పశ్చిమ బెంగాల్లో ఫిబ్రవరి 28న తుది జాబితాలు విడుదలకానున్నాయి.

## ఆ యుద్ధ నౌకలు మునిగిపోవచ్చు! ట్రంప్‌నకు ఖమేనీ హెచ్చరికలు


అమెరికా ఇరాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించబోదన్నారు. అంతేకాదు.. ప్రపంచంలో బలమైన సైనిక శక్తి ఉన్నవాళ్లకూ తీవ్ర ఎదురుదెబ్బ తగలవచ్చన్నారు. ఇరాన్‌లో పాలన మార్పు, యుద్ధ నౌకల మోహరింపుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేశారు. జెనీవా వేదికగా ఇరాన్‌అమెరికాల మధ్య పరోక్ష అణు చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. "తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదని అమెరికా అధ్యక్షుడు చెబుతున్నారు. అయితే, ఒక్కోసారి అది కోలుకోలేనంత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఇరాన్ దిశగా యుద్ధ నౌకలను పంపించామని ప్రకటనలు చేస్తున్నారు. ఆ నౌకలు నిజంగా ప్రమాదకరమైనవి. కానీ, వాటిని సముద్రంలో ముంచేసే సామర్థ్యమున్న ఆయుధం మరింత ప్రమాదకరం. 47 ఏళ్లుగా ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏమీ చేయలేకపోయామని అమెరికా అంగీకరించడం శుభపరిణామం. ఎన్నటికీ ఏమీ చేయలేరు. అణు చర్చలు జరుపుదాం అంటున్నారు. కానీ, చివరకు మీ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని చెబుతున్నారు. చర్చల ఫలితాలను ముందుగానే నిర్ధరించడం తప్పిదం, మూర్ఖత్వమే" అని ఖమేనీ వరుస ట్వీట్లలో పేర్కొన్నారు.

**మూడు గంటల్లో ముగిసిన చర్చలు..**

జెనీవా వేదికగా అమెరికాఇరాన్ మధ్య జరిగిన



అణు చర్చలు మూడు గంటల్లో ముగిశాయి. చర్చల సమయంలోనే హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సైనిక విన్యాసాలు చేపట్టింది. ఈ సందర్భంగా జలసంధిని కొన్ని గంటల పాటు మూసివేసింది. ఈ క్రమంలో లైవ్ క్షిపణులను ప్రయోగించడం గమనార్హం. ఆ ప్రాంతంలో అమెరికా సైన్యాన్ని మోహరిస్తున్న వేళ టెహ్రాన్ ఈ చర్యలకు ఉపక్రమించింది.




## ఏఐ సదస్సులో సమస్యలు.. కేంద్రమంత్రి క్షమాపణలు

భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు లో సరైన సౌకర్యాలు లేకపోవడంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలిరోజు సందర్శకులు భారీగా రావడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారీ క్యూలైన్లు, ప్రవేశ ఆలస్యంతో ఇబ్బందులు తలెత్తాయి. దీనిపై కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందిస్తూ.. సదస్సుకు హాజరైన వారికి క్షమాపణలు చెప్పారు. సదస్సు సజావుగా సాగేలా చూస్తామని హామీ ఇచ్చారు. 'ఇది ప్రపంచంలోనే అతిపెద్ద AI సమిట్. ఈరోజు 70వేల మంది ఈ శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యారు. సోమవారం జరిగిన సమిట్‌లో ఎవరైనా సమస్యలు ఎదుర్కొని ఉంటే.. దానికి ప్రభుత్వం తరఫున క్షమాపణలు కోరుతున్నాం. మీ అభిప్రాయాలను మాతో పంచుకోండి. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించడానికి మా బృందం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది' అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. కాగా సోమవారం సాయంత్రం ఏఐ (AI) సమిట్ ప్రారంభమైన సమయంలో భారత మండపం వద్ద సిబ్బంది రద్దీని నియంత్రించలేకపోయారని పలువురు నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. అందరికి సరిపడా కుర్చీలు, ఇతర సదుపాయాలు లేవన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లలో యూపీఐ పేమెంట్ సదుపాయం లేదని, లోపలికి వెళ్లడానికి గంటల తరబడి లైన్లలో వేచి ఉండాల్సి వచ్చిందని అసహనం వ్యక్తం చేశారు. పలు స్టాళ్ల వద్ద తొక్కిసలాట వంటి పరిస్థితులు నెలకొన్నాయన్నారు.

## శ్రీలంక సర్కారు కీలక నిర్ణయం.. ఎంపీల పెన్షన్లు రద్దు

కొలంబో: పొరుగు దేశం శ్రీలంక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపీల పెన్షన్లను పూర్తిగా రద్దు చేసింది. దీనికి సంబంధించిన బిల్లు పార్లమెంట్‌లో మంగళవారం ఆమోదం పొందింది. 225 మంది సభ్యులు కలిగిన సభలో 154 మంది ఈ బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. కేవలం ఇద్దరు మాత్రమే వ్యతిరేకించారు. మిగిలిన సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. శ్రీలంకలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన పార్లమెంట్ సభ్యులకు ప్రస్తుతం పెన్షన్ అందుతోంది. కొత్త చట్టం ఆమోదం పొందడంతో ఇప్పటికే అందుకుంటున్న వారితో పాటు, కొత్తగా అర్హత సాధించిన వారికీ పెన్షన్లు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే మాజీ అధ్యక్షులకు ఇచ్చే ప్రయోజనాలను దిసనాయకే ప్రభుత్వం నిలిపివేసింది. ఇంటి అద్దె, అలవెన్సులు, పెన్షన్లు, రవాణా సౌకర్యాలను గతేడాది



సెప్టెంబర్‌లో రద్దు చేసింది. పర్యాటకంపై ఆధారపడిన దేశమైన శ్రీలంకకు కరోనా, ఉగ్రవాద దాడుల కారణంగా విదేశీయుల రాక తగ్గింది. నాటి పాలకుల ఆర్థిక నిర్వహణ లోపం కారణంగా పరిస్థితి మరింత తీవ్రమైంది. 2022లో దివాళా తీసింది. దీంతో నాటి పాలకులపై ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేశంలో ఆహారం, ఔషధాలు, విద్యుత్, చమురుకు తీవ్ర సంక్షోభం ఏర్పడింది. ప్రజల నుంచి ఆందోళనలు చెలరేగడంతో నాటి అధ్యక్షుడు గొటబాయ రాజపక్స తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో మార్క్సిస్టు నేత దిసనాయకే విజయం సాధించి అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడంలో భాగంగా ఎన్నికల వాగ్దానంలో ఒకటైన పెన్షన్ల రద్దుకు బిల్లు తీసుకొచ్చారు. దేశం క్లిష్టపరిస్థితులు ఎదుర్కొంటున్న వేళ చట్టసభ సభ్యులకు పెన్షన్లు పొందే నైతికత లేదంటూ ఈ బిల్లుపై చర్చ సందర్భంగా న్యాయ శాఖ మంత్రి హర్షణ నానాయక్కర పేర్కొన్నారు.

## వైద్య సేవలకు ఏఐ ప్రత్యామ్నాయం కాదు


అమరావతి: ఆధునిక, సంప్రదాయ వైద్య విధానాలను మిళితం చేసి రోగులకు సేవలందించేలా దేశవ్యాప్తంగా చర్యలు చేపట్టినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. మంగళగిరిలోని ఎయిమ్స్ 2వ స్నాతకోత్సవానికి ఏపీ మంత్రి లోకేశ్‌తో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనుప్రియ మాట్లాడుతూ.. వైద్య రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. "కేంద్ర ప్రభుత్వం వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రజారోగ్యంపై 9శాతం బడ్జెట్ పెంచింది. వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్లకుండా ఇక్కడే పెద్దసంఖ్యలో కళాశాలలు ఏర్పాటు చేస్తున్నాం. వైద్యరంగంలో కృత్రిమ మేధ వినియోగం విప్లవం




సృష్టిస్తుంది. అయితే, వైద్య సేవలకు ఏఐ ప్రత్యామ్నాయం కాదు. సాంకేతికత ఎంత వచ్చినా ప్రజల నాడి పట్టుకుని చూడటం, వారిని ఆత్మీయంగా పలకరించడం ద్వారానే రోగులకు జబ్బు నయమవుతుంది. ప్రజల నమ్మకం కోల్పోకుండా పని చేయాలి" అని అనుప్రియ కోరారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఎయిమ్స్ ద్వారా ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుతోందని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలపై ఎయిమ్స్ దృష్టి సారించాలని కోరారు. అనంతరం మంత్రి లోకేశ్, కేంద్రమంత్రి అనుప్రియ కలిసి వైద్య విద్యలో ప్రతిభ కనబర్చిన విజయలక్ష్మి, యోగ్యతా పూజారికి బంగారు పతకాలు, విద్యార్థులకు వైద్య విద్య పట్టాలు అందజేశారు.

## రీల్ చేస్తూ డ్రైవింగ్ చేయడం వల్లే.. దిల్లీ ప్రమాదం వీడియో వైరల్

గతవారం దిల్లీలో జరిగిన కారు ప్రమాదంలో సాహిల్ అనే 23 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియోలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందులో 17 ఏళ్ల బాలుడు రీల్ చేస్తూ.. కారు నడుపుతున్నట్లు కనిపిస్తోంది. అదే సమయంలో ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టినట్లుగా చూపిస్తోంది. ఈ వీడియోపై మృతుడి తల్లి మాట్లాడుతూ.. ఆ బాలుడు నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే తన కుమారుడు



ప్రాణాలు కోల్పోయాడని ఆవేదన వ్యక్తంచేశారు. కారుతో ఢీకొట్టిన తర్వాత కూడా బ్రేకులు వేయకపోవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగిందన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. వీడియో ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాద సమయంలో బాలుడు స్కార్పియోను నడుపుతుండగా.. అతడి సోదరి రీల్ చిత్రీకరిస్తున్నట్లు గుర్తించామన్నారు. అతడికి డ్రైవింగ్ లైసెన్స్ సైతం లేదన్నారు. ఫిబ్రవరి 3న ప్రమాదం జరిగిన అనంతరం అతన్ని అరెస్టు చేసి, జువెనైల్ అబ్జర్వేషన్ హోమ్‌కు తరలించామన్నారు. అయితే పదోతరగతి బోర్డు పరీక్షల నిమిత్తం న్యాయస్థానం అతడికి మధ్యంతర బెయిల్ మంజూరుచేసినట్లు తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## 'ఎంతసేపు చదివామన్నది కాదు.. జేఈఈ మెయిన్ టాపర్ కబీర్ చిల్లర్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన జేఈఈ మెయిన్ 2026 సెషన్1 ఫలితాల్లో రాజస్థాన్ నుంచి 17 ఏళ్ల కబీర్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. జేఈఈ మెయిన్‌లో 300కు 300 స్కోర్ సాధించాడు. టాప్ స్కోర్ సాధించడంపై కబీర్ మీడియాతో మాట్లాడుతూ.. పట్టుదల, నిరంతర శ్రమ వల్లే తాను మెయిన్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించినట్లు తెలిపారు. ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ చదవడం తన లక్ష్యమన్నారు. కేంబ్రిడ్జ్‌లోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఉన్నతవిద్య అభ్యసించాలనుకుంటున్నట్లు తెలిపాడు. కోటాలో శిక్షణ తీసుకోవడం కూడా తనకు బాగా ఉపయోగపడిందన్నారు. జేఈఈలో మంచి మార్కులు సాధించడానికి ఎలా సన్నద్ధమవ్వాలనే విషయంపై తోటి విద్యార్థులకు పలు సూచనలు చేశాడు. అవేంటంటే?

* జేఈఈలో మంచి మార్కులు సాధించాలంటే నిరంతర కృషితో పాటు పరీక్షలకు సన్నద్ధమవ్వడానికి సరైన పద్ధతిని అనుసరించడం అవసరం.
* ఎక్కువ గంటలు చదవడానికి బదులు సబ్జెక్ట్‌లోని అంశాలను అర్థం చేసుకోవాలి.
* వాటిని చిన్న చిన్న టాపిక్‌లుగా విడగొట్టి.. సమగ్రంగా అధ్యయనం చేయడం వల్ల ప్రతి అంశంపైనా పట్టు సాధించగలం.
* మనం ఏం చదువుతున్నామనే విషయాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలి. పరీక్షల్లో చేసిన తప్పుల వల్ల నిరుత్సాహపడకుండా వాటి నుంచి పాఠం నేర్చుకోవాలి.
* ప్రతి పరీక్ష తర్వాత ఎక్కడ తప్పు చేశాం, ఎందులో వెనకబడి ఉన్నాం అనే విషయాలను



సమీక్షించుకోవాలి.

* మాక్ టెస్ట్‌లు రాయాలి. దీనివల్ల పరీక్షల సమయంలో సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలుస్తుంది.

## మార్కెట్లకు బ్యాంకింగ్, ఐటీ షేర్ల కళ..

**మెటల్ షేర్లు డీలా**


**వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**పీఎస్‌యూ బ్యాంకులు, ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు**

**అమ్మకాల ఒత్తిడితో నష్టపోయిన మెటల్ షేర్లు**

**25,700 మార్క్ పైన స్థిరపడిన నిఫ్టీ**

**బలహీనపడిన బంగారం.. స్థిరంగా రూపాయి మారకం విలువ**



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి బలమైన సంకేతాలు లేనప్పటికీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌యూ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, 30 షేర్ల సెన్సెక్స్ 173.81 పాయింట్లు పెరిగి 83,450.96 వద్ద స్థిరపడింది. ఇక బ్రాడర్ నిఫ్టీ 42.65 పాయింట్లు లాభపడి 25,725.40 వద్ద ముగిసింది. సెషన్ మొత్తంలో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగి టాప్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. అదేవిధంగా, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ కూడా లాభాల్లో ముగిసింది. అయితే, మెటల్ కౌంటర్లలో బలహీనత కారణంగా నిఫ్టీ మెటల్ ఇండెక్స్ దాదాపు 1 శాతం నష్టపోయింది. బ్రాడర్ మార్కెట్‌లో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.27 శాతం, స్మాల్‌క్యాప్ 0.56 శాతం చొప్పున లాభపడ్డాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో ఐటీసీ, బీఈఎల్, ఇన్ఫోసిస్, ఎల్‌డటీ, ఏషియన్ పెయింట్స్, టైటాన్ వంటి షేర్లు 2.3 శాతం వరకు లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మరోవైపు, ఎటర్నల్, ట్రెంట్, టాటా స్టీల్, రిలయన్స్, ఎండఎం, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు 1.5 శాతం వరకు నష్టపోయాయి. విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీ 25,760-25,800 స్థాయి వద్ద అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటుండగా, 25,550-25,600 వద్ద మద్దతు లభిస్తోంది. మరోవైపు, డాలర్ ఇండెక్స్‌లో కదలికలు లేకపోవడంతో రూపాయి 90.68 వద్ద పరిమిత శ్రేణిలో కదలాడింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడంతో సురక్షిత పెట్టుబడిగా బంగారంపై డిమాండ్ తగ్గింది. ఫలితంగా, గోల్డ్ ధర రూ. 1,500 తగ్గి రూ. 1,53,500 దిగువన ట్రేడ్ అయింది.

## భారత్‌లో డ్రోన్ల విప్లవం..

**38 వేలు దాటిన రిజిస్ట్రేషన్లు**

**భారత్‌లో 38,500 దాటిన రిజిస్టర్డ్ డ్రోన్ల సంఖ్య**

**39,890కి చేరిన డీజీసీఏ సర్టిఫైడ్ రిమోట్ పైలట్లు**

**'స్వామిత్వ' పథకం కింద 3.28 లక్షల గ్రామాల్లో డ్రోన్ సర్వేలు పూర్తి**

**'నమో డ్రోన్ దీదీ' కింద మహిళా సంఘాలకు 500కు పైగా డ్రోన్ల పంపిణీ**

**వివిధ రంగాల్లో విస్తృతంగా పెరుగుతున్న డ్రోన్ల వినియోగం**




**న్యూఢిల్లీ:** భారతదేశంలో డ్రోన్ రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా రిజిస్టర్ అయిన డ్రోన్ల సంఖ్య 38,500 మార్కును దాటింది. అదే సమయంలో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి ధృవీకరణ పొందిన రిమోట్ పైలట్ల సంఖ్య 39,890కి చేరినట్లు మంగళవారం విడుదలైన అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. దేశంలో డ్రోన్ల వినియోగం పెరగడానికి తయారీదారులు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, శిక్షణా సంస్థలతో కూడిన ఒక సమగ్ర వ్యవస్థ అభివృద్ధి చెందడమే కారణమని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. డ్రోన్ల ఆపరేటింగ్, నిర్వహణ కోసం నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు 240కి పైగా శిక్షణా సంస్థలు కూడా ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు, ఆర్థిక ప్రోత్సాహకాలతో ఈ రంగం కేవలం పైలట్ ప్రాజెక్టుల నుంచి ప్రధాన స్రవంతిలోకి మారింది. వ్యవసాయం, భూమి సర్వేలు, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, విపత్తుల అంచనా, ప్రభుత్వ సేవల వంటి కీలక రంగాల్లో ఇప్పుడు డ్రోన్లు అంతర్భాగంగా మారాయి. ముఖ్యంగా, 'స్వామిత్వ' పథకం కింద దేశంలోని 3.28 లక్షల గ్రామాల్లో డ్రోన్ల ద్వారా సర్వే పూర్తి చేశారు. దీని ద్వారా 31 రాష్ట్రాల్లోని 1.82 లక్షల గ్రామాలకు సంబంధించి 2.76 కోట్ల ఆస్తి కార్డులను సిద్ధం చేశారు. మహిళా సాధికారతకు కూడా డ్రోన్ టెక్నాలజీ ఊతమిస్తోంది. 'నమో డ్రోన్ దీదీ' కార్యక్రమం కింద 500కు పైగా డ్రోన్లతో సహా, మొత్తం 1,094 డ్రోన్లను మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) పంపిణీ చేశారు. భవిష్యత్తులో దేశీయ తయారీ, పైలట్లకు నైపుణ్యాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వ మద్దతుతో మానవ రహిత వైమానిక వ్యవస్థల రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా అవతరించడానికి సిద్ధంగా ఉందని అధికారిక ప్రకటన వివరించింది.

## వరుసగా రెండో రోజు తగ్గిన బంగారం ధర

**రూ. 1,530 తగ్గిన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం**

**రూ. 1,400 తగ్గిన 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం**

**కేజీ వెండి ధర రూ. 2,65,000**




**న్యూఢిల్లీ:** బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5 వేల డాలర్ల నుంచి 4,930 డాలర్లకు పడిపోవడం, డాలర్ విలువలో మార్పులు... ఇవన్నీ కలిసి దేశీయ బులియన్ మార్కెట్‌పై అమిత ప్రభావం చూపాయి.

మంగళవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో... 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,530 తగ్గి రూ.1,54,910 వద్ద కొనసాగుతోంది. గత రెండు రోజుల్లో మేలిమి బంగారం 10 గ్రాముల ధర మొత్తం రూ.2,840 తగ్గింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ.1,400 తగ్గి రూ.1,42,000కు చేరింది. వెండి ధర కూడా భారీగా తగ్గింది. కేజీ వెండి ధర రూ. 2,65,000 వద్ద కొనసాగుతోంది.




# వాంఖడేలో ఐరీ తుఫాన్..

**ప్రపంచకప్‌లో చరిత్ర సృష్టించిన నేపాల్..!**




**వాంఖడే:** పొట్టి ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లోనే ఇంగ్లండ్‌కు ముచ్చెమటలు పట్టించిన నేపాల్ ఎట్టకేలకు విజయగర్జన చేసింది. హ్యాట్రిక్ ఓటముల నుంచి తేరుకొని.. చివరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌కు దిమ్మతిరిగే షాకిచ్చింది. 174 పరుగుల ఛేదనలో ఓపెనర్లు శుభారంభమివ్వగా. దీపేంద్ర సింగ్ ఐరీ(50 నాటౌట్).. గుల్షన్ ఝా(24 నాటౌట్)లు చితక్కొట్టారు. ఆఖరి ఓవర్లో 5 పరుగులు అవసరమవ్వగా.. ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌కు ఝలక్ ఇస్తూ సంచలన విజయంతో బోణీ కొట్టి.. మెగా టోర్నీకి విజయం తో వీడ్కోలు పలికింది.


ప్రపంచకప్ ముందే వెస్టిండీస్‌ను ఓడించి సంచలనం సృష్టించిన నేపాల్ మెగా టోర్నీలోనూ విజయఢంకా మోగించింది. ఇంగ్లండ్‌పై ఎదురైన చేదు ఓటమిని దిగమింగిన.. ఆసియా జట్టు ఆఖరి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై పంజా విసిరింది. పట్టుదలతో ఆడి.. ప్రత్యర్థిని బెంబేలెత్తించి 7 వికెట్ల తేడాతో తొలి విజయంతో మురిసిపోయింది. భారీ ఛేదనలో ఓపెనర్లు ఆసిఫ్ షేక్(33), కుషాల్ భుర్తెల్(43)లు ధాటిగా ఆరంభించారు. మార్క్ వ్యాట్‌కు చుక్కలు చూపిస్తూ.. 4, 6, 6, 6తో 23 రన్స్ పిండుకున్నారు. తొలి వికెట్‌కు 74 రన్స్ జోడించి ఈ ద్వయాన్ని లీస్క్ విడదీశాడు.

కాసేపటికే లీస్క్ రోసారి షాకిస్తూ ఓపెనర్ ను వెనక్కి పంపాడు. సాధించాల్సిన రన్‌రేటు పది దాటింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన దీపేంద్ర సింగ్ ఐరీ(50 నాటౌట్)? రోహిత పౌడెల్(16) పోరాడారు. కెప్టెన్ ఔటయ్యాక గుల్షన్ సింగ్(24 నాటౌట్), ఐరీలు గెలుపు బాధ్యత తీసుకున్నారు. 16వ ఓవర్ చివరి బంతికి గుల్షన్ సిక్సర్ బాదగా.. ఐరీ వరుసగా రెండు సిక్సర్లు సంధించాడు. ఆ తర్వాతి ఓవర్లో రెండు ఫోర్లు రాగా.. బ్రాడ్ వీల్ ఓవర్లో గుల్షన్ వరుసగా 4, 6 బాదడంతో మ్యాచ్ నేపాల్ వైపు మళ్లింది. ఆఖరి ఓవర్లో 5 పరుగులు అవసరమవ్వగా తొలి బంతికి సింగిల్, రెండో బంతికి గుల్షన్ బౌండరీ కొట్టాడు. అంతే.. ప్రపంచకప్‌లో తొలి విజయంతో నేపాల్ రికార్డు నెలకొల్పింది. తుఫాన్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించిన ఐరీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

**జోన్స్ హాఫ్ సెంచరీ..**

చివరి లీగ్ మ్యాచ్‌లో మొదట స్కాట్లాండ్ బ్యాటర్లు దంచేశారు. ఓపెనర్ జార్జ్ మున్సే(27) రాణించగా.. మైఖేల్ జోన్స్(71)అర్ధ శతకంతో పునాది వేశాడు. జోన్స్, బ్రాండన్ మెక్‌ముల్లెన్( 25)ల విజృంభణతో భారీ స్కోర్ దిశగా సాగింది. అయితే.. నేపాల్ బౌలర్లు చకచకా వికెట్లు తీసి స్కోర్ వేగానికి కళ్లెం వేశారు. సోంపాల్ కమ్మి(3-25) ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీయడంతో నిర్ణీత ఓవర్లలో 173 రన్స్ చేసింది స్కాట్లాండ్.

## ఆస్ట్రేలియా కొంపముంచిన వాన..




**సూపర్ 8లో జింబాబ్వే..!**

**న్యూఢిల్లీ:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో సూపర్ 8పై ఆశలు పెట్టుకున్న ఆస్ట్రేలియాకు వరుణుడు బిగ్ షాకిచ్చాడు. పల్లెకెలె స్టేడియంలో కుండపోత కారణంగా ఐర్లాండ్ జింబాబ్వే మ్యాచ్ రద్దయ్యింది. ఈ మ్యాచ్ వర్షార్పణం కావడంతో.. మాజీ ఛాంపియన్ ఆసీస్ అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. రెండు మ్యాచ్లులోనూ నెగ్గి.. మ్యాచ్ రద్దుతో ఒక పాయింట్.. మొత్తంగా ఐదు పాయింట్లతో గ్రూప్ బీ నుంచి జింబాబ్వే జట్టు సూపర్ 8కు దూసుకెళ్లింది.

ఐసీసీ ఈవెంట్లలో చెలరేగిపోయే ఆస్ట్రేలియా ఈసారి నాకౌట్‌కు ముందే ఇంటిదారి పట్టింది. పేస్ దళంలో అనుభవజ్ఞులైన ప్యాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్ లేకపోవడం.. టాపార్డర్ వైఫల్యం, నిలకడలేమి.. ఆ జట్టు పాలిట శాపంగా మారాయి. జింబాబ్వే చేతిలో 23 పరుగుల తేడాతో.. శ్రీలంకపై 8 వికెట్ల తేడాతో ఓడడం మిచెల్ మార్ష్ నేతృత్వంలోని కంగారూ జట్టు నాకౌట్ అవకాశాల్ని సంక్లిష్టం మార్చాయి. మంగళవారం కొలంబోలోని పల్లెకెల్ స్టేడియంలో ఐర్లాండ్ చేతిలో జింబాబ్వే ఓడితే ఆసీస్‌కు అవకాశం ఉండేది. కానీ.. వర్షం కారణంగా ఐర్లాండ్ ? జింబాబ్వే మ్యాచ్ రద్దయ్యింది.

వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో టాస్ వేయకుండానే ఆటను రద్దు చేసి ఇరుజట్లకు చెరొక పాయింట్ కేటాయించారు. దాంతో.. 5 పాయింట్లతో ఆఫ్రికా జట్టు ముందంజ వేయగా.. మూడింటా ఒకేఒక మ్యాచ్ గెలిచిన ఆసీస్, ఐర్లాండ్ టోర్నీ నుంచి వైదొలిగాయి. చివరి మ్యాచ్‌లో ఒమన్‌పై ఆస్ట్రేలియా గెలుపొందినా 4 పాయింట్లతో మూడో స్థానంలో నిలుస్తుంది. కాబట్టి.. జింబాబ్వే నాకౌట్ దశకు అర్హత సాధించింది. గత సీజన్‌లో ఒమన్ చేతిలో ఓడి ప్రపంచకప్ ఆడే అవకాశం చేజార్చుకున్న ఆఫ్రికా టీమ్ ఈసారి సికిందర్ రజా నాయకత్వంలో సంచలన ప్రదర్శనతో సూపర్ 8లో అడుగుపెట్టడం విశేషం.

### భారత జట్టుకు గుడ్‌న్యూస్..
## స్టార్ ఓపెనర్ పునరాగమనం..!




**న్యూఢిల్లీ:** వరల్డ్‌కప్ విజేతగా విదేశీ పర్యటనలో జోరు కొనసాగిస్తున్న భారత మహిళల జట్టుకు గుడ్‌న్యూస్. వన్డే ప్రపంచకప్‌లో అనూహ్యంగా గాయపడి.. మూడు నెలలకు పైగా ఆటకు దూరమైన ఓపెనర్ ప్రతీకా రావల్ పునరామనం చేయనుంది. ఈమధ్యే ఫిట్‌నెస్ సాధించిన ప్రతీకకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతో, సెలెక్టర్లు ఆమెను ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఎంపిక చేశారు. టీ20 సిరీస్ ముగిసే లోపే తను టీమిండియా స్క్వాడ్‌లో చేరనుంది.

నిలకడైన ఆటతో ఏడాదిలోనే ఓపెనర్‌గా స్థిరపడిన ప్రతీకా రావల్ పునరాగమనం చేయనుంది. వన్డే వరల్డ్‌కప్‌లో లీగ్ దశ చివరి మ్యాచ్‌లో గాయపడి.. టోర్నీ నుంచి వైదొలిగిన ప్రతీకా.. ఇటీవలే కోలుకుంది. పాదం గాయం తగ్గిపోవడంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిహాబిలిటేషన్‌లో ఆమె ఫిట్‌నెస్ సాధించింది.

దాంతో.. మూడు నెలలకు పైగా జట్టుకు దూరమైన ప్రతీకను సెలెక్టర్లు వన్డే స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. దాంతో.. ఈ డాషింగ్ ఓపెనర్ కంగారూ నేలపై తన స్టయిల్లో చెలరేగేందుకు సిద్ధమవుతోంది. టెస్టు స్క్వాడ్‌లోనూ ఉన్న ప్రతీక.. మార్చి 6 న మొదలయ్యే పెర్త్ టెస్టులో ఆడనుంది.

భారత జట్టు అప్డేటెడ్ వన్డే స్క్వాడ్ : హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, ప్రతీకా రావల్, దీప్తి శర్మ, రిచా ఘోష్(వికెట్ కీపర్), ఉమా ఛెత్రీ(వికెట్ కీపర్), కష్వీ గౌతమ్, అమన్‌జోత్ కౌర్, రేణుకా సింగ్, శ్రీ చరణి, వైష్ణవీ వర్మ, క్రాంతి గౌడ్, స్నేహ్ రానా.

# కెనడాపై 8 వికెట్ల తేడాతో విక్టరీ..

**సూపర్-8లోకి న్యూజిలాండ్ ఎంట్రీ**




**చెన్నై:** టీ20 వరల్డ్‌కప్‌లో కెనడాతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కివీస్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్ అర్ధ శతకాలు బాదారు. చెన్నైలో జరిగిన గ్రూప్ డీ మ్యాచ్‌లో తొలుత కెనడా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నది. భారతీయ సంతతికి చెందిన కెనడా బ్యాటర్ యువరాజ్ సమ్రా తన బ్యాటింగ్‌తో హోరెత్తించాడు. 65 బంతుల్లోనే 110 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 బౌండరీలు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. యువరాజ్ సమ్రా దూకుడు వల్ కెనడా నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 రన్స్ చేసింది. సమ్రా, బజ్వా మధ్య తొలి వికెట్‌కు 116 పరుగులు భాగస్వామ్యం ఏర్పడింది.

భారీ టార్గెట్‌ను న్యూజిలాండ్ ఈజీగా ఛేజ్ చేసింది. కేవలం 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకున్నది. రవీంద్ర 39 బంతుల్లో 59 రన్స్, ఫిలిప్స్ 36 బంతుల్లో 77 రన్స్ చేశారు. మూడో వికెట్‌కు అజేయంగా ఆ ఇద్దరూ 146 రన్స్ జోడించారు. ఈ గెలుపుతో కివీస్ వరల్డ్‌కప్ సూపర్ 8 స్టేజ్‌లోకి వెళ్లిపోయింది.

MOVIE TIME

# గులాబీ బాస్‌కు మెగాస్టార్ శుభాకాంక్షలు..

### కేసీఆర్ పుట్టినరోజున చిరంజీవి భావోద్వేగ సందేశం

**టాకీస్:** తెలంగాణ తొలి ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పుట్టినరోజు సంద ర్భంగా అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల సందర్భంగా తెలంగాణవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా సంబరాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అభిమానులు భారీ కేక్‌ను కట్ చేసి తమ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. రాజకీయాలకు అతీతంగా కేసీఆర్,



తెలిపారు. కేసీఆర్ గారు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, ప్రశాంతతతో మరియు నిండు నూరేళ్లూ సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నట్లు చిరంజీవి తన సందేశంలో పేర్కొన్నారు. నేటితో 72వ వసంతంలో కి అడుగుపెట్టిన కేసీఆర్‌కు చిరంజీవి తో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు రాజకీయ పార్టీల నేతలు మరియు సినీ ప్రముఖులు సైతం శు భాకాంక్షలు చిరంజీవి మధ్య ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఏటా మెగాస్టార్ ఇలాగే ప్రత్యేకంగా విషెస్ తెలుపుతూ వస్తున్నా రు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అన్నదానాలు, రక్తదాన శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలు కూడా కేసీఆర్ జన్మదినం సందర్భంగా జోరుగా సాగుతున్నాయి.

# టాలీవుడ్‌పై సెన్సార్ కత్తి..

### టైటిల్స్ మార్పుతో బెంబేలెత్తుతున్న మేకర్స్

**టాకీస్:** టాలీవుడ్‌లో ఇటీవల సెన్సార్ బోర్డు అనుసరిస్తున్న కఠిన వైఖరి సినీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా సినిమాల టైటిల్స్ విషయంలో బోర్డు సభ్యులు వ్యక్తపరుస్తున్న అభ్యంతరాలు నిర్మాతలు, దర్శకుల్లో తీవ్ర నెలలో 'వానర' అనే చిత్రాన్ని సైతం 'వనవీర'గా మార్చాల్సి వచ్చింది. ఇవే కాకుండా శ్రీ చిదంబరం చిత్రాన్ని శ్రీ చిదంబరం గారు అని టైటిల్ మార్చాల్సి వచ్చింది. మరోవైపు సంతోష్ శోభన్ నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాకు అయితే ఏకంగా 'ఏ' సర్టిఫికేట్ ఇచ్చారు. టైటిల్ మార్చితే తప్ప 'యు/ఏ' ఇవ్వలేమని సెన్సార్ బోర్డు తెగేసి




అసంతృప్తిని నింపుతున్నాయి. గత నెల నుంచి ఈ నెలలో రాబోతున్న పలు చిత్రాల పేర్లపై సెన్సార్ అడ్డంకులు సృష్టించడంతో, మేకర్స్ చివరి నిమిషంలో టైటిల్స్ మార్చుకోవాల్సి వస్తోంది. సుహాస్ నటించిన 'హే భగవాన్' చిత్రానికి 'భగవాన్' అనే పదం మతపరమైన భావాలను దెబ్బతీస్తుందన్న కారణంతో దానిని 'హే బలవంత్'గా మార్చాలని సెన్సార్ బోర్డు ఆదేశించింది. అలాగే శివ కందుకూరి నటించిన 'చాయ్ వాలా' టైటిల్ దేశ ప్రధానిని ఉద్దేశించినట్లు ఉండవచ్చనే అనుమానంతో బోర్డు అభ్యంతరం తెలప డంతో, మేకర్స్ ఆ పేరును 'నవాబ్ కేఫ్'గా మార్చారు. అలాగే గత చెప్పడంతో, నిర్మాతలు తప్పనిసరి పరిస్థితుల్లో అదే సర్టిఫికేట్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకువెళ్లారు. అలాగే ఇప్పటికే టీజర్లు, ట్రైలర్లు మరియు పోస్టర్ల ద్వారా భారీగా ప్రచారం చేసుకు న్న తర్వాత ఇలా టైటిల్స్ మార్చడం వల్ల బ్రాండింగ్ దెబ్బతినడమే కాకుండా, ప్రచార ఖర్చు అంతా వృథా అవుతోందని కొందరూ నిర్మాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి అసభ్యత లేకపోయినా, బోర్డు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడంపై విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పెద్ద సినిమాలకు లేని నిబంధనలు చిన్న సినిమాలపైనే రుద్దుతున్నారనే విమర్శలు ఫిల్మ్ నగర్లో బలంగా వినిపిస్తున్నాయి.



# ఆధునిక ప్రేమలో కమ్యూనికేషనే పెద్ద సవాల్

### నటి మృణాల్ ఠాకూర్

**టాకీస్:** ప్రస్తుత ఆధునిక యుగంలో ప్రేమ సంబంధాలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ 'కమ్యూనికేషన్' అని ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్ అన్నారు. తన రాబోయే చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతర్జాలం, సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక అంతులేని అవకాశాల వల్ల సంబంధాలలో అలసట పెరిగిపోయిందని, దీనివల్ల ప్రేమ బంధాలు కూడా పెలుసుబారిపోయాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక నటిగా తన వృత్తి జీవితంలోని సవాళ్ల గురించి కూడా మృణాల్ పంచుకున్నారు. "కొన్నిసార్లు మేము పోషించే పాత్రల కోసం ప్రతికూల మానసిక స్థితిలో ఉండాల్సి వస్తుంది. ఆ ప్రభావం మనకు తెలియకుండానే మన భాగస్వామి, కుటుంబ సభ్యులు లేదా స్నేహితులపై పడొచ్చు. అందుకే, ఒక నటిగా నేను నా పాత్రలను ఇంటికి తీసుకురాకుండా ఉండేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తాను. ఇది అంత సులభం కాదు" అని ఆమె వివరించారు. ఈ సందర్భంగా పాతతరం ప్రేమకథల్లోని మాధుర్యాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు. "ఒకసారి నేను అభిమన్యు దసాని తల్లి, ప్రముఖ నటి భాగ్యశ్రీ గారితో సమయం గడుపుతున్నప్పుడు ఆమె తన ప్రేమకథ గురించి చెప్పారు. వారంలో ఒకే ఒక్క ఫోన్ కాల్ కోసం ఆమె పీసీఓ వద్ద ఎదురుచూసేవారట. సిగ్నల్ లేని చోట ఆ ఒక్క కాల్ కోసం పడిగాపులు కాసేవారట. ఆ రోజుల్లో ఒకరి సమయానికి, మాటకు ఎంతో విలువ ఉండేది. కానీ ఇప్పుడు కమ్యూనికేట్ చేయడానికి ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల ఆనాటి నిరాడంబరమైన ప్రేమలో ఉన్న స్వచ్ఛత, విలువ తగ్గిపోయాయి. ఆ పాత రోజుల్లోని ప్రేమే బాగుండేది" అని మృణాల్ అన్నారు.

ఇక 'దో దీవానే షెహర్ మే' చిత్ర విషయానికొస్తే, ఇందులో సిద్ధాంత్ చతుర్వేది, సందీపా ధర్, అయేషా రజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, భన్సాలీ ప్రొడక్షన్స్, సంజయ్ లీలా భన్సాలీ, ప్రేరణా సింగ్, ఉమేష్ కుమార్ బన్సల్, భరత్ కుమార్ రంగా కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవి ఉద్యవార్ ఫిల్మ్స్‌తో కలిసి ఈ సినిమాను సమర్పిస్తున్నారు. ఈ చిత్రం 2026, ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# చిక్కుల్లో 'ధురంధర్ 2'..

### షూటింగ్‌పై ముంబై మున్సిపల్ అధికారులు సీరియస్!

**టాకీస్:** రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ధురంధర్ 2' ప్రస్తుతం తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ముంబైలోని చారిత్రాత్మక పోర్ట్ ఏరియాలో షూటింగ్ నిర్వహిస్తున్న సమయంలో భద్రతా నియమాలను పదేపదే ఉల్లంఘించినందుకు గాను, ఆదిత్య ధర్‌కు చెందిన '꞉62 స్టూడియోస్' నిర్మాణ సంస్థపై ముంబై నగర పాలక సంస్థ (꞉ఓఅ) కఠిన చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. వారసత్వ కట్టడాలు మరియు జనసాంద్రత ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిప్పు, టపాసులు ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఫిబ్రవరి 14వ తేదీ అర్ధరాత్రి వేళ నిబంధనలకు విరుద్ధంగా షూటింగ్ నిర్వహించడం, గతంలో అనుమతి లేకుండా డ్రోన్‌లను వాడటం వంటి ఘటనలు ఈ వివాదాన్ని మరింత పెంచాయి. ఈ వరుస ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణించిన ꞉ఓఅ, ꞉62 స్టూడియోస్‌ను శాశ్వతంగా బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ప్రతిపాదించింది. దీనివల్ల భవిష్యత్తులో ముంబై నగరంలో షూటింగ్ అనుమతులు పొందే అవకాశం ఆ సంస్థకు ఉండదు. వీటితో పాటు అనుమతి లేకుండా భవనాల పైకప్పులపై షూటింగ్ చేసినందుకు మరియు అక్రమంగా జనరేటర్లను వాడినందుకు లక్ష రూపాయల జరిమానాతో పాటు సెక్యూరిటీ డిపాజిట్‌ను కూడా అధికారులు రద్దు చేశారు. రణ్‌వీర్ సింగ్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి అగ్ర తారలతో మార్చి 19న విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి, తాజా పరిణామాలు మరియు చట్టపరమైన చిక్కులు పెద్ద తలనొప్పిగా మారాయి. చట్టం ముందు సినిమా షూటింగులకైనా మినహాయింపు ఉండదని ఈ చర్యల ద్వారా ముంబై అధికారులు స్పష్టం చేశారు.



# సినిమాల్లోకి ఖుష్బూ కూతురు..

### మలయాళంలో తొలి అడుగు

**టాకీస్:** ఒకప్పటి స్టార్ హీరోయిన్, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ కుమార్తె అవంతిక సుందర్ వెండితెర అరంగేట్రానికి సిద్ధమయ్యారు. ఆమె మలయాళ చిత్ర పరిశ్రమ ద్వారా హీరోయిన్‌గా పరిచయం కాబోతున్నారు. ఆమె నటిస్తున్న తొలి చిత్రానికి 'ఆరంభం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఇటీవలే త్రిశూర్‌లోని చావక్కాడ్‌లో ఈ సినిమా పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 35 ఏళ్ల క్రితం 1991లో ఖుష్బూ సైతం మోహన్ లాల్ సరసన 'అంకుల్ బన్' అనే మలయాళ చిత్రంతోనే ఆ పరిశ్రమలో అడుగుపెట్టారు. ఇప్పుడు ఆమె కూతురు అవంతిక కూడా తల్లి బాటలోనే నడవడం విశేషం. ఈ కొత్త చిత్రంలో అవంతిక 'ఆరతి' అనే పాత్రలో కనిపించనున్నారు.

సుజేష్ అన్నీ ఈపెన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టూడియో బెల్లారూహ్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఇందులో ఇంద్రన్స్, విజయరాఘవన్, అల్తాఫ్ సలీం, కళాభవన్ షాజోన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను మలయాళంతో పాటు తమిళంలోనూ విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. గోపీ సుందర్ సంగీతం, అజయ్ విన్సెంట్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, రాజు సుందరం కొరియోగ్రఫీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కున్నంకుళం, చావక్కాడ్ పరిసర ప్రాంతాల్లో వేగంగా జరుగుతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.